వ్యవసాయంలో అగ్రగామిగా నిలుపుతాం

- కొత్త పరిశ్రమలతో ఉపాధి కల్పనకు ప్రణాళిక
- విజన్-2047కు డాక్యుమెంటరీ రూపకల్పన
- వెల్లడించిన మంత్రులు అనగాని, గొట్టిపాటి రవి

ఈనాడు, న్యూస్‌టుడే–బాపట్ల

రాష్ట్రంలో బాపట్ల జిల్లాను వ్యవసాయరంగంలో అగ్రగామిగా నిలుపుతామని రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. ప్రస్తుతం ఆరో స్థానంలో ఉందని చెప్పారు. పారిశ్రామికంగా కొంత వెనకబడి ఉంది. దీన్ని ముందు వరుసలో నిలిపేందుకు అద్దంకి, మార్టూరు, చీరాల, రేపల్లె తదితర ప్రాంతాల్లో వ్యవసాయాధారిత, ఫుడ్ ప్రాసెసింగ్, మైనింగ్ సంబంధిత పరిశ్రమలను తీసుకొస్తాం. అందుకు సంబంధించిన ప్రణాళికలు రూపొందుతున్నాయని వివరించారు. మంగళవారం బాపట్ల కలెక్టరేట్‌లో జిల్లాకు సంబంధించిన విజన్-2047 ప్రణాళికలపై రెండు గంటలకు పైగా సమీక్షించారు. అనంతరం అనగాని విలేకరులతో మాట్లాడుతూ గతంలో విజన్-2020 పేరుతో హైదరాబాద్ మహానగరాన్ని చంద్రబాబునాయుడు ఎలా అభివృద్ధి చేశారో చూశాం.. దాని ఫలితాలను ఇప్పుడు చూస్తున్నాం. ఆంధ్రప్రదేశ్‌ను స్వర్ణాంధ్రప్రదేశ్‌గా మార్చాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కృతనిశ్చయంతో ఉన్నారు. ఆ దిశగా రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడానికి విజన్-2047 పేరుతో మండల, జిల్లా స్థాయిలో చేపట్టాల్సిన పనులపై క్షేత్రస్థాయిలో అందరి అభిప్రాయాలు తీసుకుని ఒక ప్రణాళిక రూపొందించి అందజేయాలని సీఎం ఆదేశించారు. ఆ దిశగా జిల్లాలోని అందరి ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి సమీక్ష చేశాం.


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సత్యప్రసాద్, వేదికపై మంత్రి గొట్టిపాటి, ఎమ్మెల్యేలు ఏలూరి, కొండయ్య, వేగేశన, కలెక్టర్ వెంకట మురళి

తీరం.. ఉపాధికి ఊతం

జిల్లాలో 74 కిలోమీటర్ల పరిధిలో తీర ప్రాంతం ఉంది. జిల్లా అభివృద్ధికి ఇది దోహదం చేస్తుందని మంత్రి అనగాని పేర్కొన్నారు. ఇక్కడ చేపల, ఆక్వారంగం పరిశ్రమల స్థాపన, వాటికి అనుబంధంగా అనేక చిన్న కుటీర పరిశ్రమలు ఏర్పాటుచేసి జిల్లా యువతకు విస్తృతంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలుకల్పించేలా విజన్-2047లో ఆయా అంశాలను చేర్చి వాటిని అమలు చేయడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని చెప్పారు. మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ జిల్లాలో బకింగ్‌హాం కెనాల్ కాల్వ అభివృద్ధికి కీలక నిర్ణయం తీసుకున్నాం. దీన్ని గత ప్రభుత్వం విస్మరించింది. అదేవిధంగా చీరాలలో చేనేత టెక్స్‌టైల్ పార్కును ప్రతిపాదించాం. అద్దంకి, మార్టూరును పారిశ్రామిక ప్రాంతాలుగా తీర్చిదిద్దుతామని తెఇపారు. భావితరాలకు మంచి చేయటమే లక్ష్యంగా ఆయా ప్రణాళికలు ఉన్నాయని వివరించారు. కచ్చితంగా జిల్లాకు మేలు జరుగుతుందన్నారు.

ప్రభుత్వానికి ప్రతిపాదనలు

జిల్లా పాలనాధికారి వెంకట మురళి మాట్లాడుతూ పరిపాలనా దక్షత కలిగిన నాయకుడు చంద్రబాబునాయుడు అని గతంలో హైదరాబాద్ అభివృద్ధితో అది నిరూపితమైంది. ప్రస్తుతం రాష్ట్రానికి మంచి దీర్ఘకాలిక, స్వల్పకాలిక వ్యవధిలో చేపట్టాల్సిన పనులపై ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. అందులో భాగంగా జిల్లాను వ్యవసాయ రంగంలోనే కాదు పరిశ్రమల, ఉద్యాన రంగంలో ముందంజలో నిలపడానికి ప్రతిపాదనలు కోరాం. కొన్ని శాఖల నుంచి ఇవి ఇప్పటికే అందాయి. మిగిలిన శాఖల నుంచి సేకరించి ప్రభుత్వానికి పంపుతామని తెలిపారు. కేంద్రం రూ.100 కోట్లు పర్యాటక రంగానికేటాయించింది. దీని ద్వారా జిల్లాలో పర్యాటక రంగ అభివృద్ధికి ప్రణాళికలు రూపొందిస్తున్నామని వివరించారు. సమావేశంలో ఎమ్మెల్యేలు ఏలూరి సాంబశివరావు, ఎం.ఎం.కొండయ్య, వేగేశన నరేంద్ర వర్మ పాల్గొన్నారు.

11 నుంచి మిర్చి యార్డుకు సెలవులు

గుంటూరు, న్యూస్‌టుడే: గుంటూరు మిర్చియార్డుకు ఈనెల 11వ తేదీ నుంచి సెలవులు ఇస్తున్నట్లు మార్కెటింగ్ శాఖ జాయింట్ డైరెక్టర్ శ్రీనివాసరావు తెలిపారు. 11న దుర్గాష్టమి, 12న విజయదశమితో పాటు వారాంతం, 13వ తేదీ ఆదివారం సాధారణ సెలవు కారణంగా వరుసగా మూడు రోజులు పాటు మిర్చి క్రయ విక్రయాలు జరగవన్నారు.

పరిశ్రమలకు ప్రభుత్వ భూములు గుర్తించండి

బాపట్ల, న్యూస్‌టుడే: పారిశ్రామికంగా రాష్ట్రంలో అట్టడుగున మూడో స్థానంలో ఉన్న జిల్లాను మొదటి మూడు స్థానాల్లో ఒకటిగా నిలపడానికి పరిశ్రమల స్థాపన కోసం ప్రభుత్వ భూములను గుర్తించాలని మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. స్వర్ణాంధ్ర-2047 విజన్ జిల్లా ప్రణాళిక రూపకల్పనపై అధికారులు, పరిశ్రమలు, వ్యవసాయ, ఉద్యాన, ఆక్వా రంగాల నిపుణులు, ప్రతినిధులతో మంత్రులు అనగాని సత్యప్రసాద్, గొట్టిపాటి రవికుమార్ మంగళవారం సమావేశం నిర్వహించారు. మంత్రి గొట్టిపాటి మాట్లాడుతూ ఆక్వా రంగంలో హెక్టారుకు ఉత్పాదకతను 4.5 టన్నుల నుంచి 8 టన్నులకు పెంచేలా రైతులకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానం, పరికరాలు, ప్రోత్సాహకాలు అందించాలన్నారు. అద్దంకిలో రూ.300 కోట్లతో కొత్త పరిశ్రమ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. బీచ్ పర్యాటకాన్ని అభివృద్ధి చేయాలని మంత్రి అనగాని సూచించారు. చినగంజాం మండలంలో మోటుపల్లి పోర్టును పునరుద్ధరించాలని ఎమ్మెల్యే ఏలూరి అన్నారు. వేగేశన నరేంద్రవర్మ మాట్లాడుతూ సూర్యలంక-వాడరేవు మధ్య బీచ్ రోడ్డు, ఈపూరుపాలెం కాలువపై వంతెన నిర్మించాలని కోరారు. వంతెన నిర్మాణానికి రైతులు రూ.6 కోట్ల విరాళాలు అందజేయటానికి ముందుకు వచ్చారన్నారు. చేనేత రంగానికి చేయూత ఇవ్వాలని, పరిశ్రమల స్థాపనకు సత్వర అనుమతులు ఇవ్వాలని ఎమ్మెల్యే కొండయ్య కోరారు. రెండ్రోజుల్లో బాపట్ల జిల్లా 2047 విజన్ ప్రణాళిక రూపొందించి ప్రభుత్వానికి పంపిస్తామని కలెక్టర్ వెంకట మురళి పేర్కొన్నారు.

బాపట్ల జిల్లా రద్దు ప్రసక్తే లేదు : అనగాని

బాపట్ల, న్యూస్‌టుడే: బాపట్ల జిల్లాను రద్దు చేసే ప్రసక్తే లేదని రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ స్పష్టం చేశారు. కలెక్టరేట్లో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సామాజిక మాధ్యమాల్లో వచ్చే పుకార్లను ప్రజలు నమ్మరాదన్నారు. ఎన్నికల సమయంలో కొత్తగా మార్కాపురం జిల్లా, హిందూపురం కేంద్రంగా జిల్లా ఏర్పాటు చేస్తామని తెదేపా అధినేత చంద్రబాబు ప్రకటించారన్నారు. బాపట్ల జిల్లా కొనసాగుతుందని, ఈ విషయంలో ఎలాంటి అపోహలు పెట్టుకోవద్దని తెలిపారు.

రేపల్లె డీఎస్పీగా శ్రీనివాసరావు

రేపల్లె అర్బన్ న్యూస్‌టుడే: రేపల్లె డివిజన్ డీఎస్పీగా ఆవుల శ్రీనివాసరావు మంగళవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. సత్యసాయి జిల్లా పుట్టపర్తి నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఆయన మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన శాంతి భద్రతలు అందించడమే లక్ష్యమన్నారు. సీఐలు మల్లికార్జునరావు, సురేష్‌బాబు, వీరాంజనేయులు, శ్రీనివాసరావు, ఎస్సైలు డీఎస్పీకి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన డీఎస్పీ టి మురళీకృష్ణ తుళ్లూరు బదిలీపై వెళ్లారు.

సైబర్ వలకు చిక్కేది విద్యావంతులే..

జిల్లాలో అంతకంతకూ పెరుగుతున్న ఈ తరహా మోసాలు

మోసపూరిత ప్రకటనలు చూసి.. అత్యాశకు పోయి.. జేబు గుల్లయి..

సైబర్ మోసాలు కొత్త తరహాలో వెలుగులోకి వస్తున్నాయి. యువత, విద్యావంతులు, ఉద్యోగులు సైబర్ నేరగాళ్ల వలలో చిక్కుకుని మోసపోతున్నారు. సులభంగా రూ.లక్షల సంపాదించాలన్నా అత్యాశతో మోసగాళ్ల మాయలో పడుతున్నారు. రూ.లక్షలు పోగొట్టుకుని లబోదిబోమంటూ బాధితుల్లో కొందరు మాత్రమే పోలీసులను ఆశ్రయిస్తున్నారు. చాలామంది పరువు పోతుందని ఫిర్యాదులు చేయడానికి ముందుకు రావడం లేదు. ఆన్‌లైన్ నేరాల అడ్డుకట్ట కోసం ప్రతి జిల్లాలో ప్రత్యేకంగా సైబర్ పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. జిల్లాలో త్వరలో ఈ స్టేషన్ ఏర్పాటు కానుంది. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై బాగా అవగాహన కలిగిన ఇన్‌స్పెక్టర్లను ఎస్‌హెచ్‌వోలుగా నియమించనున్నారు. దర్యాప్తుకు అవసరమైన సాంకేతిక పరికరాలను అందిస్తారు.

బాపట్ల, న్యూస్‌టుడే

లాటరీ వచ్చిందని చెప్పి రూ.లక్షల్లో నిలువు దోపిడీ

గతంలో నగరాలు, పెద్ద పట్టణాల్లో సైబర్ నేరాలు ఎక్కువగా జరిగేవి. ప్రస్తుతం పల్లెల వరకు అవి విస్తరించాయి. ఓటీపీ, ఆధార్‌కార్డు నంబరు ద్వారా ప్రజల బ్యాంకు ఖాతాల నుంచి అక్రమంగా నగదు తీసుకోవటం, ఆన్‌లైన్ వ్యాపారంలో రూ.లక్షల ఆదాయం వస్తుందని నమ్మించి రూ.లక్షలు కాజేయటం, ఉద్యోగాలు ఇప్పిస్తామని మాయమాటలు చెప్పి రూ.లక్షలు వసూలు చేసి దండుకోవటం, విదేశాల నుంచి విలువైన బహుమతులు వస్తున్నాయని, రూ.కోట్ల లాటరీ విజేత మీరేనని నమ్మబలికి రూ.లక్షలు వసూలు చేయడం, నకిలీ గుర్తింపుకార్డులు సృష్టించటం, వివాహ వెబ్‌సైట్ల పేరుతో నగదు వసూలు చేయటం తదితర సైబర్ నేరాలు ఎక్కువగా జరుగుతున్నాయి. కొందరు అత్యాశతో తెలియని వెబ్‌సైట్లలో వచ్చే ప్రకటనలు నమ్మి రూ.లక్షలు పెట్టుబడిగా పెట్టి సైబర్ నేరగాళ్ల ఉచ్చులో చిక్కుకుని మోసపోతున్నారు. లాటరీ వచ్చిందని చెబితే నమ్మిన ఉపాధ్యాయుడొకరు రూ.12 లక్షలు పోగొట్టుకున్న ఉదంతాలు ఉన్నాయి.

పోలీసులు ప్రచారం చేస్తున్నా.. చెవికెక్కడం లేదు

జిల్లా ఆవిర్భావం తర్వాత 143కు పైగా సైబర్ మోసాలు జరిగాయి. కొంతమంది బాధితులే స్థానిక పోలీస్‌స్టేషన్లకు వెళ్లి ఫిర్యాదు చేశారు. చీరాల, బాపట్ల, అద్దంకి, రేపల్లెలో ఎక్కువ కేసులు నమోదయ్యాయి. సైబర్ నేరం జరిగిన వెంటనే బాధితులు 1930కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని పోలీసు అధికారులు సూచిస్తున్నారు. జాతీయ సైబర్ క్రైమ్ పోర్టల్, ‘[illegible]’లోను ఫిర్యాదు చేయవచ్చు. సైబర్ నేరాల్లో ఆర్థిక మోసాలు రూ.కోట్లలో ఉంటున్నాయి. నేరం జరిగిన వెంటనే ఫిర్యాదు చేస్తే పోలీసులు వేగంగా స్పందించి బ్యాంకు ఖాతాల నుంచి అక్రమంగా డ్రా చేసిన నగదు తిరిగి వెనక్కి తెప్పించగలుగుతున్నారు. అయితే బాధితులు మోసం జరిగిన రెండు, మూడ్రోజుల తర్వాత వస్తుండటంతో నగదు రికవరీ కష్టంగా మారుతోంది. సైబర్ మోసాల్లో రికవరీ శాతం చాలా తక్కువగా ఉంది. జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ఉన్న ఐటీ కోర్ విభాగంలోని పోలీసు అధికారులు సైబర్ నేరాల కేసుల దర్యాప్తులో సీఐలు, ఎస్సైలకు సహకారం అందిస్తున్నారు. వివిధ రకాలుగా సైబర్ మోసాలు జరిగే తీరుపై జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. పోలీసు శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అయినా ఈ తరహా నేరాలు మాత్రం తగ్గటం లేదు.



జిల్లాలో గత రెండున్నరేళ్లలో నమోదైన సైబర్ నేరాల కేసులు

సంవత్సరం	నమోదైన కేసులు	కోల్పోయిన నగదు (రూ.కోట్లలో)	రికవరీ చేసిన నగదు (రూ.కోట్లలో)
2022	48	1.75	0.04
2023	50	2.03	0.0045
2024	45	3.76	0.03

జిల్లాకో పోలీసుస్టేషన్ ఏర్పాటుతో మేలు

సైబర్ నేరాలకు అడ్డుకట్ట వేయాలని ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉంది. ఆన్‌లైన్ మోసాల బాధితులు ఎక్కువగా ఉన్నా ఫిర్యాదులు చేస్తున్న వారు తక్కువగా ఉన్నారు. జిల్లాకు ప్రత్యేక సైబర్ పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేసి ప్రతి ఆన్‌లైన్ నేరానికి సంబంధించి ఫిర్యాదు ఇచ్చేలా బాధితుల్ని ప్రోత్సహించనున్నారు. సైబర్ నేరాలకు ప్రత్యేక పోలీస్‌స్టేషన్ ఉండటం వల్ల దర్యాప్తు వేగంగా జరుగుతుంది. కేసుల్లో రికవరీ శాతం పెరుగుతుంది. ప్రస్తుతం ఈ నేరాల రికవరీ శాతం ఐదులోపే ఉంది. నేరగాళ్లకు మూకుతాడు వేస్తారు. వ్యక్తిత్వ హననానికి పాల్పడే, ఫొటోలు మార్ఫింగ్ ద్వారా మహిళలను వేధించే వారిపైన చర్యలు తీసుకోనున్నారు.

ఇద్దరి ప్రాణాలు కాపాడిన మెరైన్ పోలీసులు, గజ ఈతగాళ్లు


యువకుడి వివరాలు సేకరిస్తున్న మెరైన్ సీఐ లక్ష్మారెడ్డి

బాపట్ల పట్టణం, న్యూస్‌టుడే : సముద్రంలో స్నానమాచరిస్తుండగా ఒక్కసారిగా వచ్చిన అలల తాకిడికి ఇద్దరు(యువకుడు, బాలుడు) కొట్టుకుపోతుండటంతో గమనించిన మెరైన్ పోలీసులు, గజ ఈతగాళ్లు వారి ప్రాణాలు కాపాడారు. హైదరాబాద్‌కు చెందిన 14మంది కుటుంబ సభ్యులు మంగళవారం సూర్యలంక సముద్రతీరంలో స్నానాలు చేసేందుకు వచ్చారు. వీరిలో దయాకర్ మహేష్ అనే యువకుడు ఒక్కసారిగా వచ్చిన అలలతాకిడి సముద్రంలో కొట్టుకుపోతుండగా అక్కడే బందోబస్తు నిర్వహిస్తున్న మెరైన్ పోలీసులు, గజ ఈతగాళ్లు స్పందించి ఒడ్డుకు చేర్చారు. గుంటూరుకు చెందిన మహేష్ అనే 13 ఏళ్ల బాలుడు కుటుంబ సభ్యులతో వచ్చి స్నానమాచరిస్తూ ప్రమాదవశాత్తూ అలల తాకిడికి కొట్టుకుపోతుండగా గజ ఈతగాళ్లు కె.మీరాసాహెబ్, కార్తీక్, వి.మీరా సాహెబ్, ప్రసాద్, కార్తీక్, చెన్నయ్య, చెన్నకేశవులు స్పందించి బాలుడిని ఒడ్డుకు చేర్చి ప్రాణాలు కాపాడారు. ఇద్దరికీ మెరైన్ సీఐ లక్ష్మారెడ్డి సిబ్బంది ప్రాథమిక చికిత్స నిర్వహించి మెరుగైన చికిత్స నిమిత్తం బాపట్ల ప్రాంతీయ వైద్యశాలకు తరలించారు. వారి ఆరోగ్యపరిస్థితి మెరుగ్గానే ఉన్నట్లు మెరైన్ పోలీసులు తెలిపారు.

దారి మళ్లించి దోపిడీ

ఇసుక అమ్మేస్తున్న దళారులు

ఈనాడు– బాపట్ల

రాష్ట్ర ప్రభుత్వం ఉచిత ఇసుక విధానాన్ని తీసుకొచ్చి ఇసుక తవ్వకం, రవాణా ఛార్జీలు మాత్రమే వసూలు చేస్తోంది. ఇసుక డంపింగ్‌యార్డుల్లో టన్ను ఇసుక రూ.250కు విక్రయించి రవాణా ఛార్జీలు కూడా ప్రభుత్వమే నిర్ణయించి వినియోగదారులకు తక్కువ ధరకే సరఫరా చేస్తోంది. అయితే ఆన్‌లైన్‌లో బుకింగ్ చేసుకోవడంలో మధ్యవర్తుల జోక్యం పెరిగి సామాన్యులకు ఇసుక అందకుండా చేస్తున్నారు. దీంతో వినియోగదారులు నల్లబజారులో ఇసుక అధిక ధరకు కొనుగోలు చేయాల్సి వస్తోంది. ఇసుక బుకింగ్, రవాణాకు లారీల ఎంపికలోనూ సాంకేతిక అంశాలను అనుకూలంగా మార్చుకున్న కొందరు దళారులు ఇసుక బుక్ చేసుకుని అవసరాలు ఉన్న వారికి అమ్ముకుని జేబులు నింపుకొంటున్నారు. అందరికీ అందుబాటులో ఉండాలన్న ప్రభుత్వ లక్ష్యాన్ని కొందరు మధ్యవర్తులు నీరుగారుస్తున్నారు. దీంతో అవసరమైన వారికి ఇసుక అందక ఇక్కట్లు పడుతున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో తాళ్లాయపాలెం, పల్నాడు జిల్లాలో అచ్చంపేట మండలంలో మాత్రమే ఇసుక రెండు డంపింగ్‌యార్డుల్లో అందుబాటులో ఉంది. అక్కడి నుంచి అన్ని ప్రాంతాలకు సరఫరా చేస్తున్నారు. రోజుకు 2వేల టన్నుల చొప్పున సరఫరా చేసేలా నిర్ణయించి ఆమేరకు బుకింగ్‌కు అవకాశం కల్పిస్తున్నారు. డిమాండ్ మేరకు లభ్యత లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు.

సామాన్యులకు అందక అవస్థలు

దూరం గుర్తించడంలో ఇబ్బందులు

తాళ్లాయపాలెం ఇసుక రీచ్ నుంచి గుంటూరు, పల్నాడు, ఎన్టీఆర్, కృష్ణా, బాపట్ల జిల్లాలకు ఇసుక సరఫరా అవుతోంది. ఇక్కడ ఇసుక బుక్ చేసుకున్న తర్వాత ప్రభుత్వం ఎంపిక చేసిన లారీల ద్వారా రవాణాకు వెసులుబాటు కల్పించారు. ఇందుకు కిలోమీటర్ల వారీగా ప్రభుత్వమే ధరలు నిర్ణయించింది. ఇసుక ధర, రవాణా ఛార్జీలు చెల్లించిన వెంటనే వారికి సరఫరా మొదలవుతుంది. ఈమేరకు ఇసుక బుకింగ్ అయిన తర్వాత లారీ యజమానులు తాము రవాణా చేస్తామని యాప్‌లోనే ఆమోదం తెలపాల్సి ఉంటుంది. తాళ్లాయపాలెం నుంచి వినియోగదారులు కోరిన ప్రాంతానికి దూరాన్ని యాప్ ద్వారానే నిర్ణయిస్తారు. ఇందులో వివిధ కారణాలతో దూరం తగ్గించి నమోదుకావడంతో లారీ యజమానులు రవాణాకు ఆసక్తి చూపడం లేదు. వినియోగదారులకు ఇసుక రవాణాలో జాప్యం జరుగుతోంది. ఉదాహరణకు తాళ్లాయపాలెం నుంచి నున్నకు 15.8 కి.మీ, సూర్యారావుపేటకు 15.87 కి.మీ, సింగ్‌నగర్‌కు 19.78 కి.మీ చూపుతోంది. మంగళగిరి సమీపంలోని జాతీయ రహదారి నుంచి లారీలు వెళ్లే మార్గంలో తాళ్లాయపాలెం డంపింగ్‌యార్డుకు 20 కిలోమీటర్లపైగా దూరం వస్తోంది. దీంతో లారీ యజమానులు యాప్‌లో తక్కువగా దూరం చూపడం వల్ల నష్టం వస్తుందని ఎక్కువమంది రవాణాకు వెనుకడుగు వేస్తున్నారు.



దోచేస్తున్నారు ఇలా..

ఇసుక బుక్ చేసుకున్న దళారులు వివిధ కారణాలు చెప్పి ఇసుక లారీ వచ్చిన తర్వాత వారు బుకింగ్ చేసిన ప్రాంతంలో కాకుండా వారు ఎవరికైతే అమ్మారో అక్కడ అన్‌లోడ్ చేయిస్తున్నారు. లారీ డ్రైవరు బుక్ చేసిన ప్రాంతం కాదని అడిగితే ఆ ప్రాంతానికి లారీ వెళ్లదని, రోడ్డు చిన్నగా ఉందని, చెక్కలు అడ్డం ఉన్నాయని తదితర కారణాలు చెబుతున్నారు. యాప్‌లో బుక్ చేసిన ప్రాంతంలో ఇసుక అన్‌లోడ్ చేస్తే లారీ యజమానికి ఓటీపీ వస్తుంది. ఈ ఓటీపీ నమోదుచేస్తేనే రవాణా ఛార్జీలు యజమాని ఖాతాకు జమవుతాయి. దళారులు ముందస్తుగా బుకింగ్ చేసుకున్న ప్రాంతంలో కాకుండా వారు అనుకున్న ప్రాంతంలో అన్‌లోడ్ చేయించడంతో లారీ యజమానులు ఇబ్బందులు పడుతున్నారు. గుంటూరు నగరానికి 20 టన్నుల ఇసుక లారీ రవాణా ఛార్జీలతో కలిపి రూ.11900కు వస్తోంది. దీనిని దళారులు రూ.25 వేలకు, తెనాలికి రూ.13 వేలకు లారీ ఇసుక వస్తుండగా రూ.30వేలకు విక్రయిస్తున్నారు. పల్నాడు, బాపట్ల జిల్లాల్లో దూరాన్ని బట్టి టన్నుల లెక్కన అమ్ముతున్నారు. ఆన్‌లైన్‌లో ఇసుక బుకింగ్ చేసుకునే సమయంలో చిరునామా, విస్తీర్ణం, జియో ట్యాగింగ్ చిత్రాలు ఏది నమోదు చేసినా ఆమోదిస్తుండటంతో దళారులు సులభంగా లబ్ధి పొందుతున్నారు.

అక్రమార్కులపై చర్యలు

జిల్లాలో తాళ్లాయపాలెం ఇసుక డంపింగ్‌యార్డులో మాత్రమే నిల్వలు ఉండటంతో రోజుకు 2వేల టన్నుల చొప్పున సరఫరా చేస్తున్నాం. దళారులు ఇసుక బుక్ చేసుకుని అధిక ధరకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటున్నాం. యాప్‌లో దూరం నిర్ణయించడంలో దగ్గరి దారి తీసుకోవడంతో కొన్ని సమస్యలు ఉన్నాయి. వాటిని పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటున్నాం. అక్టోబరు 15 తర్వాత కొత్త రీచ్‌లు అందుబాటులోకి రావడంతో డిమాండ్ మేరకు సరఫరా చేస్తాం.

– భార్గవ్ తేజ, సంయుక్త పాలనాధికారి, గుంటూరు

కూరగాయలు కొనలేం

చీరాల, న్యూస్‌టుడే

కూరగాయల ధరలు కొండెక్కి కూర్చున్నాయి. నెల రోజులుగా పెరుగుతూ నేడు సామాన్యులకు అందకుండా పోయాయి. టమాట నేడు వందకు చేరువైంది. ఉల్లిపాయలు కంటతడి పెట్టిస్తున్నాయి. వీటి పరిస్థితి ఈ విధంగా ఉంటే బెండా, బీర, చిక్కుళ్ల దోస.. తాము కూడా ఏమి తక్కువ తినలేదంటు పేద వారిపై తమ ప్రతాపం చూపుతున్నాయి. పోనీ పండగల సీజన్ దేవాలయంలో ఒక కొబ్బరికాయ కొట్టి మొక్కులు చెల్లించుకుందామంటే వాటి ధరలు రెట్టింపయ్యాయి. కూరగాయలు అన్నీ కలిసికట్టుగా దాడి చేసినట్లు ధరలు పెరగటంతో పేద, మధ్య తరగతి ప్రజలు విలవిలలాడిపోతున్నారు. చాలీచాలనీ జీతంతో జీవితాలను నెట్టుకొస్తున్న వేతన జీవులు తమ వంటింటి బడ్జెట్ బాగా పెరిగిందని ఆవేదన చెందుతున్నారు.

భారీ వర్షాలు కురవటంతోపాటు అనేక ప్రాంతాల్లో వరద తాకిడికి పంటలు నీట మునిగాయి. రోజుల తరబడి ఇదే పరిస్థితి కొనసాగటంతో కూరగాయల మొక్కలు పూర్తిగా దెబ్బతిన్నాయి. కృష్ణా పరివాహక ప్రాంతాల్లో పంట పూర్తిగా దెబ్బతింది. దీనికితోడు వాతావరణ మార్పులతో దిగుబడి గణనీయంగా పడిపోయింది. తక్కువ విస్తీర్ణంలో పండిన కూరగాయలను మొత్తానికి సరఫరా చేయాల్సి వచ్చింది. దీనికితోడు పెళ్లిళ్ల సీజన్, పండగల నేపథ్యంలో డిమాండ్ విపరీతంగా పెరిగిపోయింది. దీంతో ధరలు ఆమాతం పెరిగాయని వ్యాపారులు చెబుతున్నారు.



కూరగాయల రకం	ప్రస్తుత ధర	నెలరోజుల క్రితం
టమాట	100	30
బంగాళా గడ్డ	60	40
బెండ	60	30
చిక్కుళ్లు	80	50
క్యారెట్	80	60
బీర	60	40
దోస	60	40
దొండ	60	30
ఉల్లిపాయలు కేజీ	70	40
చిన్నఉల్లి	400	200
అల్లం	200	120
కొబ్బరికాయ	40	20
పామాయిల్ కేజీ	125	90
సన్‌ఫ్లవర్ కేజీ	140	115

వచ్చే ఆదాయం వీటికే ..

కూరగాయల ధరలు భారీగా పెరగడంతో ఇబ్బందులు పడుతున్నాం. వీటితోపాటు మిగిలిన నిత్యావసరాలు కూడా పెరుగుతున్నాయి. ధరలు పెరగడంతో వచ్చే ఆదాయంలో అధిక శాతం వీటికే పోతుంది. ప్రభుత్వం స్పందించి ధరలను నియంత్రించాలి. – కృష్ణవేణి, చీరాల

మద్యం దుకాణాల దరఖాస్తులు.. 1050

బాపట్ల, న్యూస్‌టుడే: జిల్లాలో 117 మంది మద్యం దుకాణాలకు లైసెన్సుల కోసం మంగళవారం సాయంత్రానికి మొత్తం 1050 దరఖాస్తులు అందాయి. మంగళవారం ఉదయానికి 682 దరఖాస్తులు వచ్చాయి. భట్టిప్రోలు, వేమూరు, చుండూరు మండలాల్లో ఎనిమిది దుకాణాలకు సున్నా దరఖాస్తులు రావటంతో అబ్కారీ సహాయ కమిషనర్ విజయ, ఉప కమిషనర్ హేమంత్ నాగరాజు బాపట్ల వచ్చి జిల్లా అబ్కారీ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. సాయంత్రానికి నాలుగు దుకాణాలకు దరఖాస్తులు వచ్చాయి. ఇంకా భట్టిప్రోలు, చుండూరు మండలాల్లో నాలుగు దుకాణాలకు ఒక్క దరఖాస్తు రాలేదు. పట్టణాలు, మండల కేంద్రాల్లో దుకాణాలకు దరఖాస్తులు సగటున పదిపైన వచ్చాయి. గ్రామాల్లో దుకాణాలకు మాత్రం ఒకట్రెండు దరఖాస్తులు మాత్రమే అందాయి.

గవర్నర్‌ను కలిసిన ఎస్పీ తుషార్‌డూడి

బాపట్ల, న్యూస్‌టుడే: రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ వ్యక్తిగత పర్యటన నిమిత్తం సోమవారం బాపట్ల జిల్లాకు వచ్చి కొత్తఓడరేవు గోల్డేన్ రిసార్ట్స్ నందు బసచేసిన విషయం తెలిసిందే. మంగళవారం పర్యటన ముగించుకుని వెళ్తుండటంతో జిల్లా ఎస్పీ తుషార్‌డూడి ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.



గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎస్పీ తుషార్‌డూడి

పశుపోషకులకు మెరుగైన సేవలందించరూ..

మార్టూరు, న్యూస్‌టుడే: మండలంలోని కోలలపూడి పశువైద్యశాలను మంగళవారం జిల్లా పశువైద్యశాఖ అధికారి డాక్టర్ రమేశ్ పరిశీలించారు. గ్రామంలోని వైద్యశాల భవనం శిథిలావస్థలకు చేరినట్లు గ్రామస్థులు అధికారికి వివరించారు. దీన్ని తొలగించి కొత్తది ఏర్పాటు చేయాలని, పశుపోషకులకు మెరుగైన వైద్యసేవలు అందించేలా ప్రత్యేకశ్రద్ధ చూపాలని సర్పంచి మోరపాకుల సతీశ్ అధికారి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన అధికారి రమేశ్ మాట్లాడుతూ గ్రామస్థులు దీనిపై ఉన్నతాధికారులకు లిఖిత పూర్వకంగా తెలపాలని కోరారు. కార్యక్రమంలో గ్రామస్థులు కందిమళ్ల రామకోటేశ్వరరావు, కందిమళ్ల రంగబాబు, డాక్టర్ మాధవీలత పాల్గొన్నారు.



పశువైద్యశాల ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అధికారి రమేశ్, సర్పంచి సతీశ్, స్థానికులు

గ్రామీణ రహదారులకు మహర్దశ

ఉపాధి హామీ పథకంలో నిర్మాణం

జిల్లాలో 670 పనులకు రూ.76.66 కోట్లు

చీరాల అర్బన్, అద్దంకి, పర్చూరు(మార్టూరు), న్యూస్‌టుడే

'వైకాపా ప్రభుత్వ హయాంలో రహదారులు అధ్వానంగా తయారయ్యాయి... వీటిని బాగుచేయడానికి కనీసం తట్టెడు మట్టి వేయని స్థితి... దీనికితోడు మురుగు కాలువల నిర్మాణం ఊసేలేదు... ఈ క్రమంలో కూటమి సర్కారు అధికారంలోకి వచ్చిన తరువాత గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు, మురుగు కాలువల అభివృద్ధిపై దృష్టి సారించింది.. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పంచాయతీల్లో ఒకే రోజు గ్రామసభలు నిర్వహించి, పనులు గుర్తించారు... ఇలా చేయడం దేశవ్యాప్తంగా ఇదే ప్రథమం కావడం విశేషం... అంతే కాకుండా ఆ పనులకు గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద నిధులు మంజూరు చేస్తూ పరిపాలన ఉత్తర్వులు జారీ చేశారు.

పనులు.. నిధుల వివరాలు

నియోజక వర్గం	మంజూరైన పనులు	కేటాయించిన నిధులు (రూ.కోట్లలో)
బాపట్ల	67	7.58
చీరాల	79	4.10
అద్దంకి	191	19.10
పర్చూరు	198	24.96
రేపల్లె	71	9.80
వేమూరు	64	11.11



వేటపాలెం మండలంలో అధ్వానంగా ఉన్న రహదారి

జిల్లాలోని 25 మండలాల్లో గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పథకం కింద రహదారులు, సైడు కాలువల నిర్మాణానికి పెద్ద ఎత్తున నిధులు మంజూరయ్యాయి. ఆరు నియోజకవర్గాల్లో 670 పనులకు రూ. 76.66 కోట్లను కలెక్టరు పరిపాలనాపరమైన అనుమతి మంజూరు చేశారు. చీరాల నియోజకవర్గంలో చీరాల, వేటపాలెం మండలాల్లో 79 పనులు మంజూరయ్యాయి. అద్దంకి నియోజకవర్గంలోని 103 గ్రామాల్లో ఏకకాలంలో ఇంత పెద్దమొత్తంలో నరేగా నిధులు అంతర్గత సిమెంటు రహదారులు, సైడు కాలువల నిర్మాణానికి ఎపుడూ మంజూరు కాలేదు. ఈనెల 14 నుంచి 20వ తేదీ లోపు సిమెంటు రహదారులు, సైడు కాలువల నిర్మించుకోవాలని జిల్లా అధికారులు సూచించారు. అత్యవసరమైన పనులను వెంటనే ప్రారంభించుకోవాలని ఆదేశించడంతో కొన్ని చోట్ల ప్రారంభించారు. అద్దంకి మండలం చక్రాయపాలెం వద్ద సిమెంటు రహదారి నిర్మాణాన్ని రూ.10 లక్షలతో ఈనెల 4వ తేదీన చేపట్టారు. 5న జార్లపాలెం వద్ద కోతకు గురైన మైపు కల్వర్టును రూ.20 లక్షలతో నిర్మాణం ప్రారంభించారు. పర్చూరు నియోజకవర్గంలోని పర్చూరు, యద్దనపూడి, మార్టూరు, ఇంకొల్లు, చినగంజాం, కారంచేడు మండలాల్లో 198 పనులు వీటి కింద మంజూరు కావడం విశేషం.

వేమూరు నియోజకవర్గ వైకాపా ఇన్‌ఛార్జి అశోక్‌బాబు, అనుచరులపై కేసు

భట్టిప్రోలు, న్యూస్‌టుడే: బాపట్ల జిల్లా వేమూరు నియోజకవర్గ వైకాపా ఇన్‌ఛార్జి వరికూటి అశోక్‌బాబుకు, మండల కో- ఆప్షన్ సభ్యుడు, ఆ పార్టీ మైనార్టీ నాయకుడు షేక్ సలీమ్‌ల మధ్య నడిచిన మాటల యుద్ధం కేసు నమోదుకు దారి తీసింది. వివరాల్లోకి వెళితే... మాజీ మంత్రి మేరుగు నాగార్జునను ఆ పార్టీ అధిష్ఠానం బాపట్ల జిల్లా అధ్యక్షుడిగా నియమించారు. ఈ నేపథ్యంలో ఆయనకు సలీమ్ చరవాణిలో అభినందనలు పోస్టు చేశారు. గతనెల 27న అర్ధరాత్రి సమయంలో అశోక్‌బాబు సలీమ్‌కు ఫోన్ చేసి నాగార్జున అతని అనుచరులు పార్టీకి వ్యతిరేకంగా పని చేయడంతో వేమూరు నియోజకవర్గంలో ఓడిపోయానంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతేకాకుండా అశోక్‌బాబు కుమారుడు శ్రీతేజ, అనుచరులు మోతుకూరి హరిబాబు, దాసరి కిరణ్‌లు ఫోన్‌లో చంపుతామంటూ అసభ్య పదజాలంతో దూషిస్తూ బెదిరించారని బాధితుడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. తాను తప్పు చేయకపోయినా తన కుటుంబసభ్యులను అగౌరవ పరచే విధంగా మాట్లాడారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎట్టకేలకు సోమవారం భట్టిప్రోలు పోలీసులు కేసును నమోదు చేశారు. ఈ విషయం ఆ పార్టీ నాయకుల్లో చర్చనీయాంశమైంది.

పనిభారం తగ్గించాలని వినతి

రేపల్లె అర్బన్ న్యూస్‌టుడే: అంగన్‌వాడీలపై మోపిన పని భారం తగ్గించాలని సీఐటీయూ బాపట్ల జిల్లా అధ్యక్షుడు మణిలాల్, అంగన్‌వాడీ కార్మికులు, సహాయకుల యూనియన్ బాపట్ల జిల్లా అధ్యక్షురాలు ఝాన్సీ డిమాండ్ చేశారు. అంగన్‌వాడీలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంగళవారం రేపల్లె సీడీపీవో సుచిత్రకు వినతి పత్రం అందజేశారు. కేంద్రాల నిర్వహణకు తీసుకొచ్చిన యాప్‌లన్నింటినీ కలిపి ఒకటిగా చేయాలని, చరవాణులు పనిచేయక కెవైసీ అవ్వడం లేదని, రికార్డు వర్క్ తగ్గించాలని, ఏడు నెలల నుంచి ఆరేళ్ల వయసు పిల్లలకు ఎఫ్‌ఆర్‌ఎస్ రద్దు చేయలన్నారు. ప్రభుత్వం రికార్డులు ఇవ్వకపోవడంతో రూ. వెయ్యి నుంచి రూ.1200 వరకు ఆర్థిక భారం పడుతుందని తెలిపారు.

రూ.9 లక్షల సిగరెట్ల చోరీ

అద్దంకి, న్యూస్‌టుడే: పట్టణంలో సిగరెట్ అధీకృత డీలరు దుకాణంలో దొంగతనం జరిగింది. అర్ధరాత్రి దుకాణ షట్టరును గడ్డపారతో పైకి లేపి, లోపలకు ప్రవేశించిన దొంగలు ఎనిమిది సిగరెట్ దిండ్లు అపహరించారు. వీటి విలువ సుమారు రూ.9 లక్షల వరకు ఉంటుందని అంచనా వేస్తున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నెల్లూరు జిల్లా కావలికి చెందిన వ్యాపారి వైవీ.కోటేశ్వరరావు 2012 నుంచి అద్దంకిలో సిగరెట్ అధీకృత డీలరుగా పని చేస్తున్నారు. బాపట్ల, ప్రకాశం జిల్లాల్లో వివిధ ప్రాంతాల్లోని చిల్లర దుకాణదారులకు సిగరెట్లు సరఫరా చేస్తుంటారు. సోమవారం సాయంత్రం దుకాణం మూసివేసిన అనంతరం మంగళవారం ఉదయం నిర్వాహకులు దుకాణం వద్దకు రాగా షట్టరు పైకి లేపి ఉండటాన్ని గమనించారు. ఆమేరకు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ప్రత్యేక పోలీసు బృందాలు వచ్చి పరిశీలించాయి. దుకాణం వెలుపల, బయట ఉన్న నిఘా కెమెరాల్లో నిక్షిప్తమైన సీసీ పుటేజిని చూస్తున్నారు. దీని ప్రకారం దొంగతనం జరిగిన సమయం, అపహరించిన సరకు వివరాలు తెలుసుకునేందుకు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. దుకాణంలో పనిచేస్తున్న వారి చరవాణి నంబర్లు సేకరించారు. సంబంధిత అధీకృత డీలరు నుంచి ఫిర్యాదు స్వీకరించి, కేసు నమోదు చేయనున్నట్లు పోలీసులు వెల్లడించారు.



ఎన్నెస్పీ కార్యాలయం ఎదుట దొంగతనం జరిగిన దుకాణం

విద్యుత్తు అదనపు లోడుపై రూ.3.85 లక్షల జరిమానా

బాపట్ల, న్యూస్‌టుడే: పట్టణంలో గృహ, వాణిజ్య విద్యుత్తు కనెక్షన్లను విజిలెన్స్ అధికారులు మంగళవారం తనిఖీ చేశారు. విద్యుత్తు శాఖ ఎస్ఈ ఆంజనేయులు మాట్లాడుతూ మొత్తం 2,941 సర్వీసులను తనిఖీ చేయగా 69 కనెక్షన్లకు అదనపు లోడు కింద రూ. 3. 85 లక్షల జరిమానా విధించినట్లు తెలిపారు. డీఈలు మల్లికార్జునరావు, శ్రీనివాస్, ఏఈ సాయి శ్రీనివాస్ పాల్గొన్నారు.

చెరువు భూమికి పట్టా సృష్టించారు

ఆక్రమణల చెర నుంచి కాపాడాలని మంత్రి గొట్టిపాటిని కోరిన మైలవరం రైతులు

బాపట్ల, న్యూస్‌టుడే: అద్దంకి మండలం మైలవరంలో 50 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న చెరువును సగం ఆక్రమించి పట్టా భూమిగా అక్రమంగా ఆన్‌లైన్లో నమోదు చేయించారని మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు స్థానిక రైతులు మంగళవారం రాత్రి ఫిర్యాదు చేశారు. కలెక్టరేట్లో మంత్రిని మైలవరం రైతులు కలిశారు. వారు మాట్లాడుతూ చెరువు కింద 350 ఎకరాల భూమి సాగులో ఉందన్నారు. మైలవరం, ఏలేశ్వరవారిపాలెంతో పాటు బల్లికురవ మండలం వెలమవారిపాలెం గ్రామాలకు తాగునీరుకు ఈ చెరువే ఆధారమన్నారు. చెరువు ఉండటం వల్ల భూగర్భజలాలు బాగా ఉన్నాయని పేర్కొన్నారు. నరసయ్య అనే వ్యక్తి తనకు సెటిల్‌మెంట్ పట్టా ఉందని చెరువులో 25 ఎకరాలను వేరే వ్యక్తుల ద్వారా అన్యాక్రాంతం చేయించారని ఆరోపించారు. ఆక్రమణలకు గురైన చెరువును స్వాధీనం చేసుకుని సాగు, తాగునీటి అవసరాలకు వినియోగించాలని కోరారు. మంత్రి గొట్టిపాటి స్పందిస్తూ చెరువును ఆక్రమించి ఆన్‌లైన్‌లో పట్టా భూమిగా నమోదు చేయించటం చాలా తీవ్రమైన విషయమన్నారు. దీనిపై సమగ్ర విచారణ చేయించి ఆక్రమణకు గురైన చెరువును స్వాధీనం చేసుకోవాలని ఆదేశించారు. అక్రమంగా ఆన్‌లైన్‌లో నమోదు చేయించిన, చేసిన వారిపై కఠినచర్యలు తీసుకోవాలని చెప్పారు.



చెరువు ఆక్రమణపై మంత్రి గొట్టిపాటికి ఫిర్యాదు చేస్తున్న మైలవరం రైతులు

సాగునీటి కాలువ ఆక్రమిస్తున్నారని ఫిర్యాదు

స్టువర్టుపురం ఛానల్ నుంచి ఈపూరుపాలెం ఆయకట్టులోని పంట భూములకు నీరందించే సాగునీటిక కాలువను అనిల్‌కుమార్ అనే వ్యక్తి ఆక్రమించి అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు స్థానిక రైతులు ఫిర్యాదు చేశారు. రైతులు మాట్లాడుతూ 1953 నుంచి కాలువ ఉందని, ఇప్పుడు అక్రమ కట్టడాలతో మూసివేయటం వల్ల 274 ఎకరాల భూములకు సాగునీరు అందకుండా పోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై మంత్రి అనగాని స్పందిస్తూ రైతుల ఫిర్యాదుపై విచారణ చేయాలని చీరాల ఆర్డీవో దేవరకొండ అఖిలను ఆదేశించారు. సాగునీటి కాలువ ఆక్రమణకు గురి కాకుండా, నీటి ప్రవాహానికి అడ్డులేకుండా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాలు

బాపట్ల: పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాలు ఈనెల 14 నుంచి 20 వరకు నిర్వహించాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తెలిపారు. జిల్లా కలెక్టర్లతో రాష్ట్ర సచివాలయం నుంచి మంగళవారం ఆయన వీక్షణ సమావేశం నిర్వహించారు. జిల్లా నుంచి కలెక్టర్ వెంకటమురళి హాజరయ్యారు. గ్రామాల అభివృద్ధి కోసం మంజూరైన పనులపై గ్రామ సభల్లో ముందస్తు ప్రచారం చేయాలని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. గ్రామాల్లో ఎలాంటి అభివృద్ధి పనులు జరుగుతున్నాయో ప్రజలకు అవగాహన ఉండేలా ప్రచార బోర్డుల్లో వివరాలు ప్రకటించాలన్నారు. జిల్లాలో 1232 పనులను రూ.288 కోట్ల పూర్తి చేయడానికి చర్యలు తీసుకున్నట్లు కలెక్టర్ పవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకెళ్లారు. ఈనెల 16 నుంచి ఇసుక అందుబాటులోకి వస్తుందని తెలిపారు. పీఆర్ ఎస్ఈ హరేరామకృష్ణ పాల్గొన్నారు.

గుడిసెలోకి వర్షపు నీరు.. వృద్ధురాలికి ఇబ్బందులు

అద్దంకి, న్యూస్‌టుడే: అద్దంకిలో మంగళవారం వేకువజామున, మధ్యాహ్నం ఓ మోస్తరు వర్షం కురిసింది. కొద్దిసేపు కురిసిన వాన కారణంగా వీధులన్నీ జలమయమయ్యాయి. శ్రీనగర్‌లోని ఓ వృద్ధురాలి ఇంట్లోకి నీరు చేరి నిలిచింది. ఒక్కరే ఉండటం, నీరు ఎటూ వెళ్లక ఆమె ఇబ్బంది పడింది. పక్కనే గల ఖాళీప్రదేశం యజమాని అభివృద్ధి పేరిట కాలువను మట్టితో పూడ్చాడు. ఈకారణంగా ఎగువ నుంచి వచ్చే వర్షపు నీరు కాలువ మధ్యలోనే నిలిచి, పక్కనున్న గుడిసెలోకి ప్రవేశించింది. విషయం తెలుసుకున్న 10వ వార్డు కౌన్సిలర్ కొమ్మాలపాటి సుధీర్, వృద్ధురాలికి సహాయం అందించారు. ఈవిషయమై పురపాలక కమిషనర్ డి.రవీంద్ర మాట్లాడుతూ బుధవారం పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామన్నారు.



రేషన్ బియ్యం పట్టివేత

చేబ్రోలు: వట్టిచెరుకూరు మండలం చమళ్లమూడి నుంచి గుజరాత్‌కు 25 టన్నుల రేషన్ బియ్యం, గుంటూరుకు చెందిన వ్యాపారి నగరంలో మూడు టన్నుల రేషన్ బియ్యాన్ని టాటా ఏస్ వాహనంలోవేమూరు తరలిస్తుండగా స్వాధీనం చేసుకున్నట్లు చేబ్రోలు ఎస్సై వెంకట కృష్ణ చెప్పారు. నారాకోడూరు వద్ద మంగళవారం వీటిని పట్టుకున్నట్లు చెప్పారు.

మద్యం దుకాణాలకు పోటీ

అద్దంకి సర్కిల్‌లో బెదిరింపులతో టెండరుదారుల వెనక్కి

అద్దంకి, పర్చూరు (మార్టూరు), మార్టూరు, న్యూస్‌టుడే

మద్యం దుకాణాల టెండర్లు దాఖలులో పోటీ నెలకొంది. కొన్నిచోట్ల ఆటుపోట్లు, మరికొన్ని చోట్ల విపరీత గిరాకీ పలుకుతోంది. కొందరు ఈవిషయంలో జోక్యం చేసుకుని ఆటంకాలు సృష్టిస్తున్నారనే ప్రచారం ఉంది. మాకు తెలియకుండా టెండర్లు వేయరాదు. ఒకవేళ లాటరీలో వచ్చినా మాకు లోబడే పని చేయాలనే నిబంధన పెడుతున్నట్లు సమాచారం. దీంతో కొంతమంది వెనకడుగు వేస్తున్నారు. ఫలితంగా అద్దంకి సర్కిల్ పరిధిలో అధికారులు ఆశించిన దానికంటే దరఖాస్తులు భారీగా తగ్గినట్లు తెలుస్తోంది. టెండర్ల దాఖలకు రెండు రోజుల ముందు వరకు బీరాలు పలికిన వ్యాపారులు తాజాగా వెనుకడుగు వేస్తున్నట్లు సమాచారం. 'మనకెందుకులే' అనే ధోరణి వ్యాపారుల్లో వినిపిస్తుంది.

23 దుకాణాలకు 140 దరఖాస్తులు

అద్దంకి ఎక్సైజ సర్కిల్ కార్యాలయం పరిధిలో మొత్తం 23 దుకాణాలకు మంగళవారం సాయంత్రం 5 గంటల వరకు నేరుగా, అంతర్జాలం ద్వారా 140 దరఖాస్తులు అందాయి. ఒక్కో అర్జీకి రూ. రెండు లక్షల చొప్పున ధరావతుగా రూ.2.80 కోట్లు ప్రభుత్వ ఖజానాకు జమైంది. ఒక్కో దుకాణానికి సరాసరిన ఆరు దరఖాస్తులు అందాయి. 2014-19 నాటి మద్యం దుకాణాల దరఖాస్తుల్లో సరాసరిన 15-20 అందాయి. ఈసారి మద్యం పాలసీ విడుదలైన రోజుల్లో మాత్రం ఒక్కోదానికి కనీసం 20కి పైగా అర్జీలు అందుతాయని అధికారులు అంచనా వేశారు. అనూహ్యంగా కొందరు ఒత్తిడితో ఇవి గణనీయంగా తగ్గడం విశేషం. తాజా అంచనాల ప్రకారం ప్రభుత్వ ఖజానాకు సుమారు రూ.4 కోట్లకు పైగా గండి పడినట్లు అధికారుల అంచనా. ఈవిషయమై అద్దంకి ఎక్సైజ్ సీఐ ఎ.భవానీ మాట్లాడుతూ దరఖాస్తుదారులకు బుధవారం సాయంత్రం 5 గంటల వరకు గడువు ఉందని, నేరుగా గానీ, అంతర్జాలం ద్వారా గానీ దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.



అద్దంకి ఎక్సైజ్ కార్యాలయం వద్దకు వెళుతున్న దరఖాస్తుదారులు

ఇంకొల్లు.. యద్దనపూడి మండలాల పైన..

మరో ప్రధాన మండలం ఇంకొల్లు ప్రాంతంలోని మద్యం దుకాణాలకు వ్యాపారులు సిండికేట్‌గా వ్యవహరిస్తున్నారు. ఇక్కడ మూడు దుకాణాలకు 105 అర్జీలు వచ్చాయి. జాతీయ రహదారికి అత్యంత సమీపంలో నడిచే యద్దనపూడి మండలంలోని మద్యం దుకాణాన్ని స్థానిక నేతలే కాక, పక్క మండలాలకు చెందిన వ్యక్తులు భారీగా టెండర్లు వేసేందుకు రంగం సిద్ధం చేశారు. కారంచేడు మండలంలోని రెండు దుకాణాల కోసం చీరాల ప్రాంత వ్యక్తులు ముందుకు వస్తున్నారు. పర్చూరులో నాలుగు దుకాణాలకు వందకుపైగా దరఖాస్తులు వచ్చాయి. అబ్కారీ స్టేషన్ వద్ద టెండర్ల విధానంలో ఇబ్బందులు తలెత్తకుండా, వివాదాలు రేగకుండా పోలీసులు పర్యవేక్షణ కొనసాగుతోంది.

ఆ మండలంలో ఆరు దుకాణాలకు 132 టెండర్లు

పర్చూరు నియోజకవర్గంలోని మార్టూరు మండలంలో ప్రభుత్వం ఆరు దుకాణాలకు టెండర్లు పిలిచింది. ఒకటి కల్లుగీత కార్మికులకు కేటాయింపులో భాగంగా టెండర్లు పిలవలేదు. దీంతో మార్టూరు-3, వలపర్ల-1, జొన్నతాళి-1, ద్రోణాదుల-1 దుకాణాల కోసం వ్యాపారులు పోటీపడుతున్నారు. ఇప్పటికే ఆరు దుకాణాల కోసం 132 టెండర్లు పడగా బుధవారం ఇంకా వస్తాయని మద్యం వ్యాపార వర్గాలు వ్యాఖ్యానిస్తున్నాయి. నియోజకవర్గంలో దుకాణాలను దక్కించుకునేందుకు తెదేపాలోని రెండు వర్గాల వారు పోటీపడుతున్నారు. ఒక వర్గం నేతలు 90 మందికి పైగా కూటమికట్టి ఆరు దుకాణాలకు 50 టెండర్లు దాఖలుచేసే విధంగా ముందుకు కదులుతుండగా మరో ప్రజాప్రతినిధి అనుయాయులైన ఆరేడు మంది మరో 50 టెండర్లు వేసేలా సిద్ధమయ్యారు. వీరుకాక పక్క మండలాలు, జిల్లాల నుంచి దరఖాస్తులు వేసేందుకు పోటీపడుతున్నారు. కొందరు ఆన్‌లైన్‌లో మార్గాన్ని ఎంచుకుంటున్నారు.

ప్రేమించలేదని బాలిక తల్లిదండ్రులపై దాడి చేసిన నిందితుల అరెస్టు

చెరుకుపల్లి గ్రామీణ, న్యూస్‌టుడే: ప్రేమించలేదని బాలిక తల్లిదండ్రులపై దాడిచేసిన ఘటనలో నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. చెరుకుపల్లి ఎస్సై అనిల్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికను రాజోలు రెడ్లపాలానికి చెందిన కుంచాల భార్గవ్‌రెడ్డి ప్రేమించాలని ఆమె చదువుకునే పాఠశాల వద్ద వెంట పడుతుండేవాడు. విషయం తెలిసిన తల్లిదండ్రులు చదువు మాన్పించి ఇంటి వద్ద ఉంచారు. ఇటీవల ఆమెకు వివాహం చేయాలని సంబంధాలు చూస్తున్నారు. ఇది తెలిసిన భార్గవ్ రెడ్డి కక్ష కట్టి ఈనెల 7న అర్ధరాత్రి బాలిక ఇంటికి తన స్నేహితుడైన మైనర్ బాలుడితో కత్తి, ఇనుప సుత్తి తీసుకుని వెళ్లాడు. బాలికతో సహా ఆమె తల్లిదండ్రులపై దాడి చేశాడు. ఘటనలో వారు ముగ్గురు గాయాలపాలయ్యారు. బాలిక తండ్రి ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన ఎస్సై దర్యాప్తు చేశారు. మంగళవారం ఇద్దరు నిందితులను గూడవల్లి వద్ద రాజోలు అడ్డరోడ్డు సమీపంలో ఉండగా అదుపులోకి తీసుకుని న్యాయస్థానంలో హాజరు పరచగా కోర్టు వారికి రిమాండ్ విధించిందని ఎస్సై తెలిపారు.

ఇంజిన్‌లో సాంకేతిక లోపం... నిలిచిన పినాకిని

కొత్త పందిళ్లపల్లి స్టేషన్‌లో రెండు గంటలుపైగా ఆగిన రైలు

వేటపాలెం, న్యూస్‌టుడే: ఇంజిన్‌లో సాంకేతిక లోపం ఏర్పడటంతో పినాకిని ఎక్స్‌ప్రెస్ నిలిచిన సంఘటన మంగళవారం రాత్రి వేటపాలెం మండలం కొత్త పందిళ్లపల్లి రైల్వే స్టేషనులో చోటుచేసుకుంది. చెన్నై-విజయవాడ పినాకిని ఎక్స్‌ప్రెస్ ఒంగోలు రైల్వేస్టేషను నుంచి బయలుదేరగా చీరాలలో స్టాప్ ఉంది. ఇంజిన్‌లో సాంకేతిక లోపం ఏర్పడంతో అది కాస్తా కొత్త పందిళ్లపల్లి రైల్వేస్టేషనులో రాత్రి 7.53 నిమిషాలకు ఆగింది. ఇంజిన్ మరమ్మతులకు గురైన విషయాన్ని విజయవాడ రైల్వే ఉన్నతాధికారులకు లోకోపైలెట్ సమాచారం ఇచ్చారు. దీంతో అక్కడ నుంచి బయలుదేరిన ఇంజిన్ వేటపాలెం వరకు డౌన్ లైన్‌లో వచ్చి అక్కడ నుంచి అప్‌లో నుంచి ఆగిన ఇంజిన్‌ని తగిలించుకునే సరికి దాదాపు రెండు గంటలకుపైనే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడాల్సిన వచ్చింది. ఈసమయంలో కొన్ని రైళ్లను చినగంజాం నుంచి డౌన్‌లో వేటపాలెం వరకు తీసుకొచ్చి అక్కడ నుంచి అప్‌లో పంపారు. చీరాల, బాపట్ల స్టేషనులో దిగాల్సిన ప్రయాణికులు దేవుడా అంటూ పందిళ్లపల్లి ఊరిలోకి వచ్చి ఆటోల ద్వారా గ్రామాలకు వెళ్లిపోయారు. ఇక తెనాలి, విజయవాడ వెళ్లాల్సిన వారు అలాగే చీకటిలో రైలు పట్టాలపై నిలబడాల్సి రావడంతో ఆందోళన వ్యక్తం చేశారు. ఎట్టకేలకు రాత్రి 10.10 గంటలకు రైలు బయలుదేరింది.



ఆగిన పినాకిని ఎక్స్‌ప్రెస్

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 123, రిటైల్ ధర - 145, చికెన్ విత్‌స్కిన్ - 210, చికెన్ స్కిన్‌లెస్ - 239.

కృష్ణా జిల్లాలో: వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -120 రిటైల్ ధర 142 చికెన్ విత్ స్కిన్ - 206, చికెన్ స్కిన్‌లెస్ - 234.

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 128, 138, 148 చికెన్ విత్ స్కిన్ - 240 చికెన్ స్కిన్‌లెస్ - 250.

నెక్ సూచించిన కోడిగుడ్డు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 525 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.90/-.

బాపట్ల
• బాపట్ల • రేపల్లె • వేమూరు

సైకాలజీ మెటీరియల్ ఆవిష్కరణ


మెటీరియల్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నరేంద్రవర్మ

బాపట్ల, న్యూస్‌టుడే: డీఎస్సీ అభ్యర్థులకు ఉపయోగపడేలా ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు ఆధ్వర్యంలో రూపొందించిన సైకాలజీ మెటీరియల్‌ను యూటీఎఫ్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ ఆవిష్కరించారు. అభ్యర్థుల ప్రతి ఒక్కరూ మెటీరియల్ సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వినయ్‌కుమార్, కోశాధికారి వెంకటేశ్వర్‌రెడ్డి, కార్యదర్శి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మొదటిరోజు ముగిసిన ప్రజాప్రతినిధుల శిక్షణ

చెరుకుపల్లి, న్యూస్‌టుడే: పంచాయతీరాజ్ చట్టం, ప్రజా ప్రతినిధుల విధులు, బాధ్యతలు తదితర అంశాలపై పంచాయతీ ఉపాధ్యక్షులకు, వార్డు మెంబర్లకు అవగాహన కల్పించేందుకు చెరుకుపల్లి మండల పరిషత్తు కార్యాలయంలో ఏర్పాటు చేసిన శిక్షణా కార్యక్రమం మంగళవారం ముగిసింది. ఈ సందర్భంగా శిక్షకులుగా వ్యవహరించిన శ్రీనివాసన్, ఈవూరి విజయబాబులు గ్రామపంచాయతీల పరిపాలన విధానం, పంచాయతీల్లో చేపట్టాల్సిన పనులపై సమగ్రంగా వివరించారు.

6వ రోజుకు చేరిన ఆరాధనోత్సవాలు

భట్టిప్రోలు, న్యూస్‌టుడే: గ్రామంలోని శ్రీ షిర్డీ సాయిబాబా 106వ ఆరాధనోత్సవాలు 6వ రోజుకు చేరాయి. బాబాకు ఉదయం గంధాభిషేకం, అభిషేకాలు నిర్వహించారు. మాతా పాఠశాల చిన్నారులతో కోలాట కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM


బాపట్ల : 80085 73141, రేపల్లె : 80085 73135, వేమూరు: 91107 837382

? మండలంలోని కొమలి ప్రధాన రహదారి పక్కన ఉన్న పరిపక్వత భవనం ముందు మురుగునీరు నిల్వ ఉండటంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. దోమలకు నిలయంగా మారి వ్యాధులు ప్రబలుతాయని ఆందోళన చెందుతున్నారు.
- స్థానికులు, కొమలి

✔ మురుగునీరు నిలిచిన విషయం నాదృష్టికి వచ్చింది. వెంటనే తొలగించి ప్రజలకు ఇబ్బంది లేకుండా చేస్తాం.
- సుజాత, గ్రామ కార్యదర్శి, కొమలి

-న్యూస్‌టుడే పిట్టలవానిపాలెం

శైవవాణి మాస పత్రిక సంపాదకుడి మృతి


రామమోహనరావు (దాచిన చిత్రం)

చెరుకుపల్లి న్యూస్‌టుడే: విశ్రాంత ఉపాధ్యాయుడు, శైవవాణి మాస పత్రిక సంపాదకుడు నూతలపాటి రామమోహనరావు (81) వృద్ధాప్యం కారణంగా మృతి చెందారు. ఈయన కవిగా సాహితీవేత్తగా పలుప్రాంతాలకు సుపరిచితులు. చెరుకుపల్లి మండల పరశురామ బ్రాహ్మణ సేవా సంఘానికి సలహాదారుగా పనిచేశారు. వీరికి ముగ్గురు కుమారులు. వీరి మృతి పట్ల ప్రజాసాహితి మాసపత్రిక సంపాదకులు కొత్తపల్లి రవిబాబు, సాహితీవేత్త బొర్రు గోవర్ధన్, బ్రాహ్మణ సంఘాల నాయకులు నివాళి అర్పించారు.

ఎనిమిది నెలలు.. అసంపూర్తిగా పనులు

వేమూరులో సమకూరని వసతులతోనే సామాజిక వైద్యశాల | గతపాలకుల నిర్వాకమే కారణం

వేమూరు, న్యూస్‌టుడే

సాధారణంగా ప్రభుత్వ కార్యాలయాలు, ఆసుపత్రులు భవన నిర్మాణాలు పూర్తైన తర్వాత అందులో వసతులు సమకూర్చుతూ పనులు ప్రారంభిస్తారు. కానీ గత పాలకులు వేమూరులో సామాజిక వైద్యశాలలో రూ. 8.64 కోట్లతో ఓపీ, ఐపీ విభాగాలను నిర్మించి తల పెట్టారు. ఎన్నికల తరుణంలో కోడ్ వస్తుందన్న ఆలోచనతో మూడంతస్తుల నిర్మించాల్సిన ఐపీ విభాగ భవనాలను గ్రౌండ్ ఫ్లోర్‌తో సరిపెట్టి పనులు పూర్తి కాకుండానే భవనాలకు రంగులు వేసి హడావుడిగా ప్రారంభించారు. దీంతో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందక అవస్థలు పడుతున్నారు. ఇది జరిగి ఎనిమిది నెలలు గడిచినా అసంపూర్తిగా ఉన్న పనులు మొదలు కాలేదు.


మొదటి అంతస్తులో నిరుపయోగంగా కిటికీలు

అరకొర వైద్యసేవలు

గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యసేవల కోసం ఏర్పాటు చేసిన సామాజిక వైద్యశాల అధికారుల అలసత్వం వల్ల ప్రాథమిక వైద్యశాల స్థాయిలోనే నడుస్తుంది. వాస్తవానికి ఐపీ బ్లాక్ పనులు పూర్తి కాకపోవడం వల్ల సేవల కోసం వచ్చేవారిని వైద్యులు పరీక్షించి, మందులిచ్చి ఇళ్లకు పంపుతున్నారు. ఇక్కడ అత్యవసర చికిత్సలు జరగాలంటే శస్త్రచికిత్సలు నిర్వహించే గది, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఎక్స్‌రే పరికరాలు అమర్చలేదు. పరీక్షలు నిర్వహించడానికి ల్యాబ్ అసిస్టెంట్, రేడియో గ్రాఫర్ తదితర సిబ్బంది అందుబాటులో ఉన్నారు కానీ పరికరాలు లేవు. దీంతో ప్రజలు ఏ సమస్య వచ్చినా గుంటూరు జిల్లాలోని తెనాలికి పరుగులు తీస్తున్నారు.



బయటకు పనులు పూర్తయినట్లు కనిపిస్తున్న ఐపీ భవనం



ఆరు నెలలగా ఎక్స్‌రే గదికి వేసి ఉన్న తాళం

రూ. 2కోట్లకు ప్రతిపాదనలు పంపాం

వేమూరు సామాజిక వైద్యశాలకు ఇంకా కొన్ని వైద్య పరికరాలు రావాల్సి ఉంది. అంతే కాదు ఐపీ బ్లాక్ పనులు పూర్తి చేయడానికి రూ. 2కోట్ల నిధులు అవసరమని ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరు కాగానే పనులు ప్రారంభిస్తాం. ప్రస్తుతం రోగులకు ఇబ్బంది లేకుండా సేవలు అందిస్తున్నాం.

- జరీనాపర్వీన్, వైద్యాధికారి వేమూరు సామాజిక వైద్యశాల

చట్టాలపై అవగాహన అవసరం


మాట్లాడుతున్న సీనియర్ సివిల్‌జడ్జి వెంకటేశ్వర్లు

భట్టిప్రోలు: ప్రతి ఒక్కరికీ చట్టాలపై అవగాహన అవసరమని రేపల్లె మండల న్యాయ సేవాధికార సభ్యులు, సీనియర్ సివిల్ జడ్జి ఎ.వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక పంచాయతీ కార్యాలయ ఆవరణలో మంగళవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. సీనియర్ సివిల్ జడ్జి మాట్లాడుతూ..గ్రామీణ ప్రాంత ప్రజలు చట్టాలపై అవగాహన లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. చిన్నపాటి వివాదాలు వచ్చినప్పుడు గ్రామ పెద్దలతో చర్చించుకుని పరిష్కరించుకోవాలన్నారు. కోర్టు వివాదాలైతే న్యాయ సలహాలను పొందాలని సూచించారు. సీనియర్ న్యాయవాది షేక్ అమీనా రెహమాన్, సర్పంచి దారా కిరణ్మయి, తహసీల్దార్ మేకా శ్రీనివాసరావు, న్యాయ సేవాధికార సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

12న మాలల చైతన్య సదస్సు

రేపల్లె అర్బన్ న్యూస్‌టుడే: నగరం మండలం సజ్జావారిపాలెం లక్ష్మీగణపతి ఫంక్షన్ హాల్లో ఈనెల 12న ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లను ఉపకులాల వారీగా వర్గీకరించి క్రిమిలేయర్‌ను అమలు పర్చుకోవచ్చని సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలపై మాలల చైతన్య సదస్సు నిర్వహిస్తున్నట్లు జైభీం రావ్ భారత్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి దోవా రమేష్ రామ్‌జీ తెలిపారు. దీనిపై రేపల్లెలో గోడపత్రిక ఆవిష్కరించారు.

మా చెంత చేరుమా.. మహాలక్ష్మమ్మా

దసరా నవ రాత్రులు వైభవంగా జరుగుతున్నాయి. బాపట్ల, వేమూరు, రేపల్లె నియోజకవర్గాల్లో ఆరోరోజైన మంగళవారం అమ్మవారు మహాలక్ష్మిగా దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో అమ్మవారి విగ్రహాలను కరెన్సీ నోట్లతో అలంకరించి నిత్య పూజలు చేశారు. బాపట్లలోని శ్రీ మహర్షి ఆశ్రమ గోశాలలో అధిష్ఠాన దేవత శ్రీ మనసాదేవి అమ్మవారికి పూజలు నిర్వహించగా శ్రీకాత్యాయని అమ్మవారి అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. చెరుకుపల్లి ఆర్యవైశ్య కల్యాణ మండపంలో జరిగిన సామూహిక కుంకుమార్చనలో మహిళలు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. **-న్యూస్‌టుడే బృందం**


వేంకటేశ్వరస్వామి ఆలయంలో..


బ్రాహ్మణ సమాఖ్య మండపంలో..


శంకర విద్యాలయంలో..


టౌన్‌హాలు మండలంలో..


ఎస్ఎస్‌పీ అగ్రహారం శివాలయంలో కరెన్సీ నోట్లతో..


కూచినపూడి రజక బజారులో కనకదుర్గమ్మ విగ్రహం


జంపని శివాలయంలో ధనలక్ష్మిగా..


వలివేరులో


ఇసుకపల్లిలో మంగళగౌరీదేవి


పేటేరులో శ్రీమహాలక్ష్మీదేవిగా..


పోటుమెరకలో విజయదుర్గాదేవి


నగరంలో..


పెద్దింటమ్మతల్లి కల్యాణ మండపంలో..


అమృతలూరులో మహాకాళికాదేవిగా..


సంగుపాలెం కోడూరులో.. శ్రీధనలక్ష్మిగా..


చెరుకుపల్లిలో సామూహిక కుంకుమార్చనలో మహిళలు


ఖాజీపాలెంలో శాంభవిగా..


అల్లూరులో శ్రీలలితా త్రిపురసుందరీ దేవిగా..


నడింపల్లిలో ధనలక్ష్మిగా..


స్కంధమాత దేవిగా..


భట్టిప్రోలులో..

ఆధునిక పద్ధతులతో అధిక దిగుబడులు



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీఏ సయ్యద్ అక్తర్ హుస్సేన్

కర్లపాలెం, న్యూస్‌టుడే: ఆధునిక వ్యవసాయ పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచని బాపట్ల రైతు శిక్షణా కేంద్రం ఏడీఏ సయ్యద్ అక్తర్ హుస్సేన్ తెలిపారు. మండలంలో గణపవరం, చింతాయపాలెం గ్రామాల్లో మంగళవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. యాజమాన్య పద్ధతుల గురించి రైతులకు వివరించారు. విచక్షణా రహితంగా ఎరువులు వాడటం, కలుపు నివారణ చేపట్టకపోవడం వల్ల పురుగులు వృద్ధి చెంది దిగుబడి తగ్గుతుందని పేర్కొన్నారు. మండల వ్యవసాయాధికారి సుమంత్‌కుమార్, ఏఈవో భాగ్యలక్ష్మి, వీఏఏ వేదశ్రీ పాల్గొన్నారు.

బాపట్ల పట్టణం, న్యూస్‌టుడే : వరి పొలాల్లో ఆశించిన ఆకు ముడత వ్యాధి నివారణకు రైతులు పొలం గట్లను ఎప్పటికప్పుడు శుభ్రపరుచుకోవాలని మండల వ్యవసాయాధికారి ఆర్. చంద్రశేఖర్ సూచించారు. మండల పరిధిలోని ముత్తాయపాలెం, అడవి పంచాయతీల్లోని రైతు భరోసా కేంద్రాల పరిధిలోని వ్యవసాయ అనుబంధ శాఖల ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు.

వేమూరు,న్యూస్‌టుడే: రైతులు రసాయన ఎరువులు, పురుగు మందులు వాడి ఖర్చు పెంచుకోకుండా, సేంద్రియ వ్యవసాయంతో పెట్టుబడి ఆదా చేసుకోవాలని మండల వ్యవసాయాధికారిణి సునీత తెలిపారు. మండలంలోని కోడిపర్రు, పెనుమర్రు పొలాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు.

ఇంటూరు, తురుమెళ్ల, (అమృతలూరు), న్యూస్‌టుడే: వరిపైరులో అక్కడక్కడ నల్లి పురుగు, తెల్లదోమ ఆశించిందని బాపట్ల సహాయ వ్యవసాయ సంచాలకురాలు లక్ష్మి తెలిపారు. మండలంలోని ఇంటూరు, తురుమెళ్ల గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం సందర్భంగా పొలాల్లో పర్యటించారు.

ఒక్కసారిగా వర్షం.. రహదారులు జలమయం


ఇంట్లోకి వర్షం నీరు చేరడంతో అరుగుపైకి ఎక్కి కూర్చున్న యువకుడు

కొల్లూరు, వేమూరు, న్యూస్‌టుడే: ఉన్నట్టుండి మంగళవారం మధ్యాహ్నం కొల్లూరు, వేమూరు మండలాల్లో ఒక్కసారిగా కారుమబ్బులు కమ్ముకుని కుండపోతగా వర్షం కురవడంతో అన్ని గ్రామాల్లోని రహదారులు జలమయమయ్యాయి. కొన్ని చోట్ల నివాసాల్లోకి సైతం నీరు చేరింది. మండల కేంద్రం కొల్లూరులో అస్తవ్యస్తంగా ఉన్న మురుగు నీటి పారుదల వ్యవస్థ ఎగదట్టడంతో పల్లంగా మారిన రహదారులతో పాటు ఈ మధ్య కాలంలో ఎత్తుగా పునర్నిర్మాణం చేసినప్పటికీ ఆ రహదారులపై కూడా మోకాలి లోతున వర్షం నీరు నిలిచింది. జంపని-పోతుమర్రు రోడ్డులో మోకాళ్లలోతున నీరు చేరడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బంది ఏర్పడింది. ఇటీవల అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్న నేపథ్యంలో వరి, మినుము సాగు చేసిన రైతులు ఆందోళన చెందగా ప్రస్తుతం కురిసిన వర్షం కొంతమేర వారికి ఉపశమనం కలిగించింది.


కొల్లూరులో వెల్లటూరు ప్రధాన రహదారిపై నిలిచిన నీరు

రోడ్డుకు అడ్డంగా పడిన భారీ వృక్షం


రోడ్డుకు అడ్డంగా పడిన భారీ వృక్షం

వేమూరు : ఆకాశంలో మేఘాలు కమ్ముకొచ్చి వర్షం కురవడంతో తెనాలి- వెల్లటూరు మార్గంలో జంపని వద్ద ఓ భారీవృక్షం నేలకూలి రోడ్డుకు అడ్డంగా పడింది. దీంతో ఈ మార్గంలో గంటకుపైగా రాకపోకలు స్తంభించాయి. సమాచారం అందుకున్న వేమూరు ఎస్ఐ రవికృష్ణ సంఘటన స్థలానికి చేరుకుని అడ్డంగా పడిఉన్న చెట్టును తొలగించడానికి జేసీబీని పిలిపించారు. అయితే యంత్రంతో తొలగించే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోవడంతో, బ్యాటరీ రంపాలతో చెట్టును ముక్కలుగా కోయించి జేసీబీ సాయంతో వాటిని పక్కకు తొలగించారు.

ఆధార్ కార్డు మంజూరుకు చర్యలు


వివరాలు సేకరిస్తున్న తహసీల్దారు శ్రీనివాసరావు

రేపల్లె అర్బన్ న్యూస్‌టుడే: ఆధార్ కార్డులేని యానాదులకు కార్డు మంజూరు చేసేలా సన్నాహాలు చేస్తున్నామని రేపల్లె తహసీల్దారు మొర్ల శ్రీనివాసరావు తెలిపారు. రేపల్లె మండలం పెనుమూడి, చాట్రగడ్డ, విశ్వేశ్వరం, బొబ్బర్లంక, చోడాయపాలెం, నిర్మల్‌నగర్, కైతేపల్లి, రాజుకాల్వ, లంకెవానిదిబ్బ ఎస్టీ కాలనీల్లో మంగళవారం శిబిరం నిర్వహించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలో శిబిరాలు నిర్వహించి ఆధార్‌కార్డు లేని సుమారు 300 మందిని గుర్తించామన్నారు. పెద్దలతో పంచనామా నిర్వహించి డాక్యుమెంటేషన్ చేయించామని తెలిపారు. తొలుత వారికి సచివాలయాల ద్వారా జనన ధ్రువీకరణ పత్రం మంజూరు చేయించి వచ్చే వారంలో క్యాంప్‌లు ఏర్పాటు చేసి ఆధార్ కార్డు మంజూరు చేస్తామని ఆయన తెలిపారు.

రైస్‌మిల్లుల్లో తనిఖీలు

బాపట్ల, న్యూస్‌టుడే: పట్టణంలోని రైస్‌మిల్లుల్లో విజిలెన్స్, తూనికలు కొలతల శాఖల అధికారులు మంగళవారం ఆకస్మిక తనిఖీలు చేశారు. పారిశ్రామిక వాడతో పాటు దరికొత్తపాలెంలోని మిల్లుల్లో మంగళవారం రాత్రి తనిఖీలు కొనసాగించారు. అయితే ఎలాంటి కేసులు నమోదు కాలేదని తెలిసింది.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

రేపల్లె అర్బన్ న్యూస్‌టుడే: మండలంలోని రావిఅనంతవరంలో అనారోగ్యంతో గతనెల 22న మృతి చెందిన కాంట్రాక్టు విద్యుత్తు కార్మికుడు పిల్లి శేఖర్ కుటుంబ సభ్యులను మంగళవారం విద్యుత్తు కార్మిక సంఘం ప్రతినిధులు పరామర్శించి రూ.21,500 ఆర్థిక సాయం అందజేశారు. మృతుడి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని కార్మిక సంఘం, సీఐటీయూ బాపట్ల జిల్లా అధ్యక్షుడు బొర్రా సురేష్, సీహెచ్ మణిలాల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

అంగన్‌వాడీ యాప్‌లన్నీ ఒకే యాప్‌గా మార్చాలి

బాపట్ల, న్యూస్‌టుడే: అంగన్‌వాడీ సెంటర్ నిర్వహణకు అందుబాటులోకి తీసుకొచ్చిన యాప్‌లన్నీ కలిపి ఒకే యాప్‌గా మార్చాలని సీఐటీయూ నేతలు మంగళవారం ఐసీడీఎస్ పీడీ ఉమాకు వినతిపత్రం అందించారు. రికార్డు వర్కు తగ్గించాలని, ఏడు నెలల నుంచి 6 ఏళ్లలోపు పిల్లలకు ఎఫ్ఆర్ఎస్ రద్దు చేయాలని కోరారు. ప్రభుత్వం రికార్డులు ఇవ్వలేదని, ఇకొక్కరూ రూ.వెయ్యి నుంచి రూ.1200 ఖర్చు పెట్టుకుని రికార్డులు కొనుగోలు చేసి రాయడం అంగన్‌వాడీలకు భారంగా మారిందని పేర్కొన్నారు. జిల్లా కార్యదర్శి రేఖా ఎలిజిబెత్, సీతాలక్ష్మి, శైలశ్రీ, ముత్యాలమ్మ, హేమలత పాల్గొన్నారు.

ఇలా ఉంటే చివరి భూములకు నీరందేదెలా?

మండల కేంద్రం నగరంలో సుమారు 200ల ఎకరాలకు సాగు నీరందించే పూడివాడ తూర్పు కాలువ కొన్ని ఏళ్లగా అభివృద్ధికి నోచుకోవడం లేదు. దీంతో కాలువ రూపు రేఖలు పూర్తిగా మారిపోయాయి. స్థానిక ఉన్నత పాఠశాల నుంచి పాత ఇండియన్ బ్యాంక్ వరకు ముళ్లపొదలు, చెట్లతో కాలువ కనిపించడం లేదు. ఎగువ నుంచి వచ్చే సాగునీరు కిందకు చుక్కనీరు రావడం లేదని ఆయు కట్టు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులకు విన్నవించినా ఫలితం లేదని గ్రామానికి చెందిన రైతులు ఏడుకొండలు, తిరుపతి వెంకయ్య, కోటయ్య, కాంతారావులు వాపోతున్నారు. ఇప్పటికైనా స్పందించి కాలువ పూడిక తీయించాలని అన్నదాతలు కోరుతున్నారు. **–న్యూస్‌టుడే, నగరం**


పూడివాడ తూర్పు కాలువ దుస్థితి

సదరన్ శిబిరం మళ్లీ నిర్వహించాలని విజ్ఞప్తి

బాపట్ల, న్యూస్‌టుడే: దివ్యాంగుల కోసం సదరన్ వైద్య శిబిరాన్ని బాపట్ల ప్రాంతీయ ఆసుపత్రిలో మరోసారి నిర్వహించాలని డీఎంహెచ్‌వో విజయమ్మను దివ్యాంగ నేతలు ఆదిశేషు, బాలసుందర్ కోరారు. డీఎంహెచ్‌వోను కలిసి వారు మాట్లాడుతూ గత నెల 4న నిర్వహించిన సదరన్ శిబిరానికి దివ్యాంగులంతా హాజరు కాలేదన్నారు. 90 శాతం అంగవైకల్యం ఉన్నా ధ్రువీకరణ పత్రం లేకపోవటంతో ప్రభుత్వం ఇస్తున్న రూ.15 వేల పింఛను అందుకోలేకపోతున్నారని తెలిపారు. మరోసారి శిబిరం నిర్వహించి అర్హులైన దివ్యాంగులకు ధ్రువీకరణ పత్రాలు అందజేయాలని కోరారు.


డీఎంహెచ్‌వో విజయమ్మతో మాట్లాడుతున్న దివ్యాంగ నేతలు ఆదిశేషు, బాలసుందర్

ఆటో బోల్తా పడి 12 మందికి గాయాలు

బాపట్ల ప్రాంతీయ ఆసుపత్రికి తరలింపు



ప్రమాదంలో గాయపడినవారు

బాపట్ల, న్యూస్‌టుడే: కాకుమాను మండలం రేటూరు పరిధిలో ఆటో బోల్తా పడి పల్నాడు జిల్లా క్రోసూరు మండలం 88 తాళ్లూరు గ్రామానికి చెందిన 12 మంది గాయపడిన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. కాకుమాను మండలం కొండపాటూరులో పోలేరమ్మ తల్లి మొక్కులు తీర్చుకోవటానికి తాళ్లూరు గ్రామ వాసులు వచ్చారు. ఆలయంలో మొక్కులు తీర్చుకున్న అనంతరం సూర్యలంక బీచ్‌కు ఆటోలో బయలు దేరారు. రేటూరు దాటిన తర్వాత వేగ నియంత్రణ వద్ద ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో లక్ష్మి అనే మహిళ తీవ్రంగా గాయపడింది. ఆమెను మెరుగైన చికిత్స నిమిత్తం గుంటూరు తరలించారు. అన్నపూర్ణ, నాగమోహన్, తిరుపతి స్వామి, మణి వాసంతి, నాగేశ్వరరావు తదితరులు గాయపడగా చికిత్స నిమిత్తం బాపట్ల ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు.

భార్యను వేధించడంపై గృహహింస కేసు

వేమూరు, న్యూస్‌టుడే: భార్యను అధిక కట్నం తేవాలని వేధించడంపై గృహహింస కేసు నమోదు చేసినట్లు ఎస్సై రవికృష్ణ తెలిపారు. పోలీసుల వివరాల మేరకు.. వేమూరు మండలం కాకర్లమూడికి చెందిన చందు అనితకు, గుంటూరు జిల్లా గుంటూరుకు చెందిన కిలారి తులసీ ప్రియతమ్‌తో 5 ఏళ్ల క్రితం వివాహమైంది. ఆదిలో కాపురం సజావుగా సాగింది. తరవాత భర్త భార్యను అధిక కట్నం తేవాలని వేధించడం మొదలు పెట్టాడు. భర్తతో పాటు అత్త రత్నకుమారి, మామ రామబ్రహ్మేశ్వరరావు, బావ సాయికిరణ్ శరీరకంగా మానసికంగా వేధిస్తున్నట్లు అనిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

క్రైమ్ కార్నర్

రోడ్డు ప్రమాద ఘటనపై..

బాపట్ల పట్టణం, న్యూస్‌టుడే : స్థానిక కన్యకా పరమేశ్వరీ దేవస్థానం వద్ద 7న ఆదివారం వెనుక నుంచి కారు ఢీ కొట్టడంతో గాయాలపాలై ప్రాంతీయ వైద్యశాలలో చికిత్స పొందుతున్న ద్విచక్ర వాహనదారుడు పెద్దినేని కుమారస్వామి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. ఈ మేరకు ఎస్సై చంద్రావతి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

జూద స్థావరాలపై పోలీసుల దాడులు

బాపట్ల పట్టణం, న్యూస్‌టుడే : మండల పరిధిలోని స్టువార్టుపురంలో జూద స్థావరాలపై మంగళవారం వెదుళ్లపల్లి పోలీసులు దాడి చేశారు. ఎస్సై పి.జనార్ధనరావు ఆధ్వర్యంలో జరిగిన దాడుల్లో జూదం ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ. 2,100 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.



జిల్లా స్థాయి పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థికి అభినందనలు

స్వర్ణాంధ్ర-2047 విజన్ జిల్లా స్థాయి వ్యాస రచన పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన నగరం మండలం ఉల్లిపాలేనికి చెందిన విద్యార్థిని కె.లక్ష్మీ సింధూరకు మంత్రులు అనగాని సత్యప్రసాద్, గొట్టిపాటి రవికుమార్ అభినందనలు తెలిపారు. **– న్యూస్‌టుడే, బాపట్ల**

తెదేపా సీనియర్ నేత మృతికి సంతాపం


శ్రీనివాసరావు (పాత చిత్రం)

బాపట్ల, న్యూస్‌టుడే: మండల పరిధిలోని అప్పికట్లకు చెందిన తెదేపా సీనియర్ నేత ఇనగంటి శ్రీనివాసరావు(48) గుండెపోటులో స్వగృహంలో మంగళవారం కన్నుమూశారు. ఆయన మృతిపై ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ, తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి తాతా జయప్రకాష్ నారాయణ, తెలుగు మహిళా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మానం విజేత, తెదేపా మండల అధ్యక్షుడు ముక్కామల శివ సంతాపం తెలిపారు.

చీరాల

• చీరాల • అద్దంకి • పర్చూరు

హమ్మయ్య...గుంత పూడ్చారు!

ఈనాడు స్పందన



పూడ్చిన గుంత

చీరాల అర్బన్, న్యూస్‌టుడే: ఏళ్లుగా వైద్యశాల రహదారిలో కుంగిన రోడ్డును ఎట్టకేలకు మున్సిపల్ అధికారులు పూడ్చారు. దీనివల్ల నిత్యం రద్దీగా ఉండే మార్గంలో ఇప్పటి వరకు వాహనదారులు పడిన ఇబ్బందులు తప్పనున్నాయి. దీనిపై 'కుంగిన రోడ్డుకు అడ్డుపెట్టారు...బాగుచేయరా' అనే శీర్షికతో 'ఈనాడు'లో ఇటీవల కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన మున్సిపల్ అధికారులు ట్రాక్టర్ ద్వారా సిమెంటు, మెటల్ కలిపిన రద్దును తీసుకొచ్చి రహదారి కుంగిన ప్రాంతంలో పోసి చదును చేయడంతో వాహనదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇదే విషయాన్ని ఎమ్మెల్యే కొండయ్య మున్సిపల్ అధికారులతో చర్చించడం గమనార్హం.

నీటి పరీక్షలు తప్పనిసరి



వార్డు అడ్మినిస్ట్రేటివ్ కార్యదర్శులతో సమావేశమైన కమిషనరు అబ్దుల్ రషీద్

చీరాల అర్బన్, న్యూస్‌టుడే: ప్రజలకు అందించే తాగునీటి పరీక్షలు చేయాలని, నీటి కుళాయి బకాయిలు వెంటనే వసూలు చేయాలని కమిషనర్ అబ్దుల్ రషీద్ పేర్కొన్నారు. మున్సిపల్ కార్యాలయంలో ఉన్న తన ఛాంబర్‌లో మంగళవారం ఎమినిటి, శానిటేషన్, ఎన్విరాన్‌మెంట్, అడ్మినిస్ట్రేటివ్ కార్యదర్శులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పారిశుద్ధ్య కార్యక్రమాల నిర్వహణలో ఎటువంటి లోపాలు ఉండకూడదని, ట్రేడ్ లైసెన్సులు, ఖాళీ స్థలాలకు పన్నులు, దుకాణాల అద్దెలు నూరుశాతం వసూలు చేయాలన్నారు.

మురుగులోనే నడక



చెప్పులు లేకుండా మురుగునీటిలో వెళుతున్న చిన్నారులు

కొరిశపాడు మండలం పి.గుడిపాడు గ్రామంలోని ఎస్సీ కాలనీలో పారిశుద్ధ్యం అధ్వానంగా తయారైంది. మురుగు కాలువలు సక్రమంగా లేక పోవడంతో మురుగునీరు రోడ్లపైనే పారుతోంది. ఆ ప్రాంతం నడిచి వెళ్లే వారు ఇబ్బందులు పడుతున్నారు. కాలనీ నుంచి పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు కూడా ఈ దారిలోనే నడిచి వెళ్లాల్సి వస్తుంది. ఇప్పటికే స్థానిక అధికారులకు సమస్యను పరిష్కరించాలని పలుమార్లు అర్జీలు అందించామని ఎస్సీ కాలనీ వాసులు తెలిపారు. వెంటనే సమస్యను పరిష్కరించాలని వారు కోరుతున్నారు. -న్యూస్‌టుడే, పి. గుడిపాడు, (మేదరమెట్ల)

తీరం.. రెండు వరసల మార్గం

రూ.8 కోట్లతో పనులు ప్రారంభం... మార్చి నాటికి పూర్తి చేయాలనే లక్ష్యం

చీరాల అర్బన్, వేటపాలెం, న్యూస్‌టుడే

చీరాల తీరంలో రెండు లైన్ల రహదారి పనులు ప్రారంభమయ్యాయి... దీన్ని మార్చి నాటికి పూర్తి చేయాలనే లక్ష్యంతో అధికారులు ఉన్నారు... ప్రస్తుతం ఉన్న రహదారి వెడల్పు తక్కువగా ఉండటం వల్ల ఒక వాహనం ఎదురుగా వస్తే మరొకటి రోడ్డు దిగాల్సిన పరిస్థితి... ఇది పూర్తయితే ఆ ఇబ్బందులు తొలగడంతో పాటు తీరం వెంట పర్యాటకుల రాకపోకలకు సౌకర్యంగా ఉండనుంది.

చీరాల వాడరేవుతో పాటు వేటపాలెం మండలంలోని రామాపురం తీర ప్రాంతాలు పర్యాటకంగా అభివృద్ధి చెందాయి. ఇక్కడికి తెలంగాణతో పాటు గుంటూరు, విజయవాడ, నెల్లూరు, ఒంగోలు ప్రాంతాల నుంచి పర్యాటకులు తమ కుటుంబ సభ్యులతో సరదాగా గడిపేందుకు వస్తుంటారు. మిగిలిన రోజుల్లో వీరి సంఖ్య రెండు వేలు ఉండగా వారాంతపు రోజులు, సెలవు దినాల్లో ఆ సంఖ్య ఐదు వేలకు చేరుతుంది. దీంతో ప్రైవేట్ అతిథి గృహాల వారు వీరికి అన్ని వసతులు ఏర్పాటు చేసేందుకు ముందుకొస్తున్నారు. ప్రభుత్వపరంగా ఇక్కడ ఎటువంటి సౌకర్యాలు లేకపోవడం గమనార్హం. ఉన్న ఒక్క అతిథి గృహం ప్రారంభం కాకుండా శిథిలావస్థకు చేరింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పర్యాటక రంగం అభివృద్ధిపై దృష్టి సారించింది. దీనిలో భాగంగా సముద్ర తీరంలో పర్యాటకులు ప్రయాణించేందుకు వీలుగా ఇప్పటికే ఒక రహదారి ఉంది. ప్రస్తుతం దాన్ని రెండు లైన్లుగా విస్తరించేందుకు శ్రీకారం చుట్టింది. ఈ పనులకు సంబంధించి ఈ ఏడాది జులై 7న శిలాఫలకాన్ని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య ఆవిష్కరించారు. గడిచిన పది రోజుల నుంచి పనులను గుత్తేదారు మొదలెట్టారు. వీటిని పంచాయతీరాజ్ ఇన్‌స్టిట్యూషన్స్ (పీఐయూ) ఇంజినీరింగ్ విభాగం అధికారులు పర్యవేక్షిస్తున్నారు. ప్రస్తుతం 3.75 మీటర్ల వెడల్పున రహదారి ఉండగా దీన్ని ఏడు మీటర్లుగా విస్తరిస్తున్నారు. దీంతో పాటు రెండు వైపులా 1.5 మీటర్ల వంతున బర్మలు వేయనున్నారు. దాదాపు పది మీటర్ల వెడల్పుతో కొత్త రోడ్డు నిర్మించనున్నారు.



రోడ్డు నిర్మాణానికి వాడరేవులో ఆవిష్కరించిన శిలాఫలకం

విస్తరణ: వాడరేవు నుంచి పొట్టిసుబ్బయ్యపాలెం వరకు
పొడవు: 8.4 కిలోమీటర్లు
నిధులు: రూ.8 కోట్లు (స్టేట్ డెవలప్‌మెంట్ మిడికేషన్ ఫండ్ పథకం)



పొక్లెయినుతో రహదారి వెడల్పు పనులు

ఆక్రమణల తొలగింపుపై సందిగ్ధం

కొత్తగా వేస్తున్న రోడ్డు కోసం కొంతమేర ఆక్రమణలు తొలగించాల్సి ఉంది. వీటిని తొలగించడానికి ఇప్పటికే రిసార్ట్స్ యజమానులు కూడా ముందుకు వచ్చి సముద్రం వైపునకు వెంచారనే ప్రతిపాదన తీసుకొచ్చినట్లు సమాచారం. అయితే జులైలో శంకుస్థాపన చేసినా రెండు నెలలు ఆలస్యంగా పనులు మొదలెట్టడానికి కారణంగా వ్యాజ్యాలు వినిపిస్తున్నాయి. తీరం వెంట దాదాపు ఒక కిలోమీటరు వరకు ఆక్రమణలు ఉన్నట్లు ఇంజినీరింగ్ అధికారులు ఇప్పటికే గుర్తించారు. వీటిని ఎలా తొలగించాలనే దానిపై సందిగ్ధంలో ఉన్నట్లు తెలుస్తోంది. రహదారి నిర్మాణానికి అందరు సహకరిస్తే రోడ్డు సౌకర్యవంతంగా ఉంటుందనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో అధికారులు ఎలా ముందుకెళతారో వేచి చూడాల్సిందే.

మాంసం దుకాణాలతో చిక్కులు



చెరువు కట్టను ఆనుకుని ఉన్న చికెన్ దుకాణం

యద్దనపూడి, న్యూస్‌టుడే : మండల కేంద్రం యద్దనపూడి తాగునీటి చెరువు కట్టను ఆనుకుని మాంసం విక్రయాలు సాగించడం వల్ల స్థానికులకు చిక్కులు ఏర్పడుతున్నాయి. కొన్నాళ్లుగా స్థానిక ఉన్నత పాఠశాల ఎదురుగా ఉన్న చెరువుకట్టపై వ్యాపారులు చికెన్ దుకాణాలు ఏర్పాటు చేసి విక్రయాలు సాగించడం వల్ల స్థానికులను ఆందోళనకు గురిచేస్తున్నట్లు వాపోతున్నారు. మాంసం వ్యర్థాలను కుక్కలు తీసుకువెళ్లి చెరువు కట్టపై తినడంతో వ్యర్థాలు తాగునీటిలో కలుస్తున్నాయని గ్రామస్థులు వాపోతున్నారు. దుకాణాల నుంచి వ్యర్థాలు తాగునీటిలో కలవకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

పోలీసులమని బెదిరిస్తూ రూ.లక్షల వసూళ్లు

✤ ఉద్యోగాలు, సినిమా అవకాశాలిస్తామని వల ✤ ఇద్దరు నిందితుల అరెస్టు

మద్దిపాడు, న్యూస్‌టుడే: పోలీసులమంటూ బెదిరిస్తూ పలువురు వ్యక్తుల నుంచి రూ. లక్షలు వసూలుచేసిన ఇద్దరు నిందితులను ప్రకాశం జిల్లా మద్దిపాడు పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. వారి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. అపరిచిత వ్యక్తులు తనకు ఫోన్లు చేసి డబ్బులు డిమాండ్ చేస్తున్నారంటూ దొడ్డవరప్పాడు సర్పంచి బెజవాడ రాము గత నెల 20న పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసి విచారణ జరిపిన పోలీసులు మంగళవారం బాపట్ల జిల్లా అద్దంకి పట్టణం మారంవారి వీధికి చెందిన పెరుసోముల వీరనారాయణ, పెరుసోముల సత్యనారాయణను అరెస్టు చేశారు. అనంతరం వారిని విచారించగా పలు విషయాలు వెల్లడయ్యాయి. డీజీపీ ఆఫీసు నుంచి మాట్లాడుతున్నామని, మీ అవినీతి వ్యవహారం మాకు తెలుసంటూ నిందితులు ఫోన్ చేసి బాధితులను బెదిరించే వారు. గతంలో దొడ్డవరప్పాడు సర్పంచ్ బెజవాడ రామును బెదిరించి రూ. 10 వేలు ఫోన్ పే ద్వారా తీసుకున్నారు.

సినిమాల పేరుతో..

సినిమా అవకాశాలిప్పిస్తామని విజయనగరం, ఒంగోలు, తెలంగాణ రాష్ట్రంలోని రాచకొండ ప్రాంతాలకు చెందిన వారిని నిందితులు బెదిరించారు. ఈ మేరకు తమ వద్ద నుంచి రూ. 40 లక్షల వరకూ వసూలు చేశారంటూ ఒంగోలు నగరానికి చెందిన దంపతులు మద్దిపాడు స్టేషన్‌కు వచ్చి వాపోయారు. విజయనగరానికి చెందిన ఓ యువతి నుంచి రూ. 9 లక్షల వరకూ వసూలు చేశారు. నిందితులను మంగళవారం సీతారామపురం కొష్టాలు వద్ద అరెస్టు చేశామని, విచారణ నిర్వహించి పూర్తి వివరాలు త్వరలో వెల్లడిస్తామని పోలీసులు తెలిపారు. కార్యక్రమంలో సీఐ శ్రీకాంత్ బాబు, ఎస్సై శివరామయ్య, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

శింగరకొండకు పోటెత్తిన భక్తులు

శింగరకొండ(అద్దంకి), న్యూస్‌టుడే: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా దూరప్రాంతాల నుంచి భక్తులు స్వామి వారి దర్శనం కోసం వచ్చారు. ధ్వజ స్తంభం వద్ద ప్రధాన ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అధికారులు ఏర్పాట్లు చేశారు. ఉదయం అభిషేకం నుంచి సాయంత్రం ప్రదోష కాలార్చన వరకు క్యూలైన్‌లో భక్తులు బారులు తీరగా వివిధ పూజలు నిర్వహించారు. సాయంత్రం పల్లకీ సేవలో స్వామి, అమ్మవార్లను ఆలయ మాఢవీధుల్లో ఊరేగించారు.

కార్యదర్శులు పారదర్శకంగా పనిచేయాలి

బల్లికురవ(అద్దంకి) : గ్రామ పంచాయతీ కార్యదర్శులు పారదర్శకంగా పనిచేయాలని ఎంపీడీవో కుసుమకుమారి అన్నారు. మండల పరిషత్ సాధారణ సమావేశం ఎంపీపీ బడుగు శ్రీలక్ష్మి అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈసందర్భంగా పలువురు మండల స్థాయి అధికారులు తమ శాఖాపరమైన నివేదికలను చదివి వినిపించారు. పారిశుద్ధ్యం లోపించిన కారణంగా ఇటీవల కాలంలో మండలంలోని ముక్తేశ్వరం, అంబడిపూడి, కొప్పెరపాడు తదితర గ్రామాల్లో విషజ్వరాలు ప్రబలిన అంశంపై ఎంపీటీసీ సభ్యులు సభ దృష్టికి తీసుకెళ్లారు. సకాలంలో పారిశుద్ధ్య పనులు చేపట్టి ఉంటే ప్రజలకు కొంతమేర నష్టం తగ్గేదన్నారు. కొమ్మినేనివారిపాలెం, గుంటుపల్లి, ఉప్పుమాగులూరు, మల్లాయపాలెం, వి.కొప్పెరపాడు, బల్లికురవ ఎంపీటీసీలు, వివిధ గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు.

హెచ్ఐవీ పీడితులపై వివక్ష తగదు



కార్యక్రమంలో మాట్లాడుతున్న సీఐ మల్లికార్జునరావు

మేదరమెట్ల, న్యూస్‌టుడే: హెచ్ఐవీ పీడితులపై వివక్ష తగదని అద్దంకి రూరల్ సీఐ మల్లికార్జునరావు అన్నారు. మేదరమెట్లలోని హెల్ప్ స్వచ్ఛంద సంస్థ కార్యాలయంలో హెచ్ఐవీ పీడితులకు పోషకాహార పంపిణీలో ఆయన మంగళవారం మాట్లాడారు. ఒంగోలుకు చెందిన వైద్యులు బి. బాలాజీనాయక్, కిరణ్మయి సహకారంతో పోషకాహారాన్ని అందజేసినట్లు హెల్ప్ సంస్థ డైరెక్టర్ బీవీ సాగర్ తెలిపారు. కార్యక్రమంలో వైద్యురాలు నిఖిలా రెడ్డి, సంస్థ సిబ్బంది రాధ, కరుణ, మల్లేశ్వరి, దుర్గ, శ్రావణి, కృష్ణవేణి పాల్గొన్నారు.

పంచాయతీల ప్రగతికి కృషి అవసరం

అద్దంకి, జే పంగులూరు, న్యూస్‌టుడే: పంచాయతీల పురోభివృద్ధికి అధికారులు, పాలకమండలి సభ్యులు ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని ఎంపీడీవో బి.సింగయ్య అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఉప సర్పంచి, సభ్యుల శిక్షణ తరగతులు నిర్వహించారు. కార్యదర్శి విజయపాల్ అధ్యక్షత వహించారు.

★ జే పంగులూరు మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన శిక్షణ తరగతులకు ఎంపీడీవో స్వరూపరాణి, ఈవోఆర్డీ సుమంత్, హాజరయ్యారు.

బల్లికురవ(అద్దంకి), న్యూస్‌టుడే: పంచాయతీలో చోటుచేసుకుంటున్న పరిణామాలను ఎప్పటికపుడు ఉన్నతాధికారులకు తెలియజేయాలని ఎంపీడీవో కుసుమకుమారి అన్నారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద శిక్షణ తరగతుల్లో ఆమె మాట్లాడారు. గ్రానైట్ క్వారీలు అధికంగా ఉన్న మండలంలో సెస్ రూపంలో వచ్చే నిధులను సమర్థంగా వినియోగించాల్సి ఉందన్నారు. వృథా ఖర్చులు తగ్గించుకోవాలని, అభివృద్ధి పనుల్లో రాజీపడొద్దని పంచాయతీ కార్యదర్శులు, ఉప సర్పంచి, వార్డు సభ్యులకు సూచించారు.


యద్దనపూడి: గ్రామాల అభివృద్ధిపై ప్రజాప్రతినిధులు కీలకభూమిక పోషించాలని ఎంపీడీవో మహ్మద్ అఖిద్ జావేద్ కోరారు. యద్దనపూడి ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం ఆర్జీఎస్ఏ ప్రణాళికపై శిక్షణ నిర్వహించారు. ఏవో లక్ష్మీనారాయణ, ఈవోపీఆర్డీ పీటీవీ.కృష్ణ పాల్గొన్నారు

నేడు ఆర్థిక అంశాలపై అవగాహన సదస్సు

ఇంకొల్లు, న్యూస్‌టుడే: మిరేఎసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ, జన్‌మని సంయుక్తంగా ఇంకొల్లులోని శుభమస్తు కల్యాణ మండపంలో బుధవారం ఆర్థిక అంశాలపై అవగాహన సదస్సు ఏర్పాటు చేసినట్లు నిర్వాహక కమిటీ ప్రతినిధి బత్తుల వెంకట సుబ్బారెడ్డి తెలిపారు. ఆర్థిక నిపుణులు వి.కృష్ణ చైతన్య, జె.వేణుగోపాల్, వి.కృష్ణారావు హాజరై ఆదాయ పన్ను, స్థిరాస్థి పన్ను, మదుపు, పొదుపు పద్ధతులు తదితర అంశాలపై వివరించనున్నట్లు చెప్పారు. సదస్సు సెబీ నియంత్రణలో నిర్వహిస్తున్నారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుందని ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు, వ్యాపారవర్గాలు పాల్గొనాలని వెంకట సుబ్బారెడ్డి తెలిపారు.

రంగా విగ్రహ పనుల శంకుస్థాపనకు ఎమ్మెల్యేకు ఆహ్వానం

సోపిరాల (చినగంజాం), న్యూస్‌టుడే: సోపిరాల సెంటర్‌లో నిర్మించనున్న కాపు సంఘం నేత, దివంగత వంగవీటి రంగా కాంస్య విగ్రహం, బస్టాండ్ పనుల శంకుస్థాపనకు ముఖ్య అతిథిగా రావాలని సోపిరాల గ్రామ పెద్ద డాక్టర్ టీఎస్ఆర్ ఆంజనేయులు తదితరులు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావును మంగళవారం ఆహ్వానించారు. బాపట్లలో ఏలూరిని కలిశారు. ఈ నెల 16న ఉదయం 9గంటలకు ముహూర్తం నిర్ణయించారు. గ్రామస్థులు పాల్గొన్నారు.



ముప్పవరం సాయిబాబా ఆలయంలో మహాలక్ష్మిగా..



పంగులూరు భీమలింగేశ్వరస్వామి గుడిలో..



అద్దంకి పోలేరమ్మ గుడిలో బాలా త్రిపురసుందరిగా..




చీరాల సంతబజారులో శాకంబరిగా..

ఐశ్వర్య రూపిణి.. అనంతశక్తి వాహిని..

చీరాల అర్బన్, అద్దంకి, జేపంగులూరు, పర్చూరు, మార్టూరు, కారంచేడు, యద్దనపూడి, ఇంకొల్లు, చినగంజాం, మేదరమెట్ల, న్యూస్‌టుడే: చీరాల, పర్చూరు, అద్దంకి నియోజకవర్గాల్లో దసర నవరాత్రులు వైభవంగా సాగుతున్నాయి. దేవాలయాలు, మండపాల్లో అమ్మవారిని భక్తులు విశేషంగా కొలుస్తున్నారు.. మంగళవారం జగన్మాతను ఐశ్వర్యప్రదాయిని అయిన లక్ష్మీగా అలంకరించి, పూజలు చేశారు. మహిళలు సామూహిక కుంకుమ పూజల్లో పాల్గొంటున్నారు. పారాయణాలు చేస్తున్నారు. ఆలయాలు దేదీప్యమానంగా వెలుగొందుతున్నాయి.



చీరాల: శ్రీకామాక్షి అమ్మవారు



జొన్నతాళిలో డబ్బులతో అలంకరణ



ద్రోణాదులలో గాయత్రీమాతగా..



మార్టూరులో మహాలక్ష్మిగా..



పర్చూరు: నూతలపాడులో మహాలక్ష్మిగా..

భాజపా గెలుపుపై హర్షం



నినాదాలు చేస్తున్న భాజపా నాయకులు

చీరాల, న్యూస్‌టుడే: హరియాణాలో సాధించిన విజయంతో తమ పార్టీపై, మోదీ నాయకత్వంపై ప్రజల్లో నమ్మకం చెక్కుచెదరలేదనే విషయం స్పష్టమైందని భాజపా నాయకులు పేర్కొన్నారు. హరియాణా, జమ్ము, కశ్మీరులో జరిగిన అసెంబ్లీ ఎన్నికలో సత్తాచాటి హరియాణాలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తున్న సందర్భంగా చీరాల భారతీయ జనతాపార్టీ నాయకులు సంబరాలు చేసుకున్నారు. గడియారస్తంభం వద్ద బాణసంచా కాల్చి మిఠాయిలు పంచారు. ఈసందర్భంగా బాపట్ల పార్లమెంటరీ పార్టీ కన్వీనర్ బి. హేమంత్‌కుమార్, అసెంబ్లీ బాధ్యులు కుమారు, జిల్లా కార్యదర్శి కాకర్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రస్తుత ఫలితాలు మోదీ నాయకత్వ పటిమకు నిదర్శనమని చెప్పారు. నాగేశ్వరరావు, జయశంకర్, నాశిన మణికుమార్, మేడికొండ భరణీరావు, పింజల భరణీరావు, రాంబాబు, మనోహరరెడ్డి, బలరాంసింగ్ పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు



కొమ్మాలపాడులో రైతులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

వేటపాలెం, న్యూస్‌టుడే: మామిడిలో యాజమాన్య పద్ధతులు పాటిస్తే మంచి దిగుబడులు వచ్చే అవకాశం ఉందని జిల్లా ఉద్యాన అధికారిణి జెన్నమ్మ పేర్కొన్నారు. రామన్నపేట రైతు సేవా కేంద్రం పరిధిలో మంగళవారం నిర్వహించిన 'పొలం పిలుస్తోంది'లో ఆమె మాట్లాడారు. మామిడి తోటలను సందర్శించారు. జిల్లా పరిశోధన కేంద్రం డీడీఏ విజయనిర్మల, వ్యవసాయాధికారి కాశీవిశ్వనాథం, ఉద్యాన శాఖ ఏవో అలేఖ్య వివిధ అంశాలపై అవగాహన కల్పించారు.

అద్దంకి, జే పంగులూరు, బల్లికురవ(అద్దంకి), మేదరమెట్ల, సంతమాగులూరు, న్యూస్‌టుడే: మిరప పంటను రక్షించుకోవాలంటే తప్పకుండా జిగురు అట్టలు ఉపయోగించాలని అద్దంకి ఉద్యాన శాఖాధికారి దీప్తి అన్నారు. అద్దంకి మండలం చక్రాయపాలెం, వెంపరాల గ్రామాల్లో మంగళవారం 'పొలం పిలుస్తోంది' నిర్వహించారు. అంతకు ముందు ఆయా గ్రామాల్లోని మిరప పంటలను వ్యవసాయాధికారి కె.వెంకట కృష్ణతో కలిసి పరిశీలించారు.

✤ బల్లికురవ మండలం గుంటుపల్లి, బల్లికురవలో జరగ్గా మార్టూరు ఏడీఏ కె. శ్రీనివాసరావు పాల్గొన్నారు. మండల వ్యవసాయాధికారి ఎస్‌వీపీ.కుమారితో పాటు వంశీ, ప్రవీణ్ పాల్గొన్నారు.

✤ జే పంగులూరు మండలంలోని రేణంగివరం, కశ్యాపురం జరిగిన కార్యక్రమాల్లో అధికారులు మినుము, సుబాబుల్ పంటలు పరిశీలించారు. ఏవో డి.సుబ్బారెడ్డి, బోరెడ్డి ఓబుల్‌రెడ్డి, ధూళిపాళ్ల శ్రీనివాసరావు, నారాయణస్వామి, చల్లగుండ్ల రవిబాబు పాల్గొన్నారు.

✤ కొరిశపాడు మండలం బొల్లవరప్పాడు, దైవాలరావూరు గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమంలో ఏడీఏ ధనరాజ్, ఏవో పి.శ్రీనివాసరావు, ఏఎంసీ సూపర్‌వైజర్ రామాంజనేయులు, వీఏఏ ప్రత్యూష, ఉపసర్పంచి డి. నాగేశ్వరరావు పాల్గొన్నారు.

✤ సంతమాగులూరు మండలం కొమ్మాలపాడులో జరిగిన కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ విభాగపు సిబ్బంది హనుమంతరావు, సుబ్బారావు, వెంకటరత్నం, రవికిరణ్, అఖిల్, ఖాలేషావలి రైతులకు అవగాహన కల్పించారు.

ఇంకొల్లు, పర్చూరు, న్యూస్‌టుడే: శనగ సాగుచేసే రైతులు విత్తనశుద్ధితో తెగుళ్లు నివారించుకోవచ్చని పర్చూరు వ్యవసాయ సంచాలకులు మోహనరావు రైతులకు సూచించారు. వంకాయలపాడులో జరిగిన కార్యక్రమంలో వ్యవసాయాధికారి వేణుగోపాల్, పశు పంవర్ధక శాఖ సహాయకుడు అనిల్, మార్కెట్ యార్డు సహాయకుడు సుబ్బారావు, గ్రామ సహాయకులు భరత్, కిషోర్ పాల్గొన్నారు.

న్యాయవాది మృతికి సంతాపం

చీరాల, న్యూస్‌టుడే: చీరాలకు చెందిన సీనియర్ న్యాయవాది కటకం చంద్రశేఖరరావు (50) అనారోగ్యంతో మంగళవారం విజయవాడలోని ఓ ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతూ మృతిచెందారు. ఈయనకు భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. కేసీఆర్‌గా ప్రసిద్ధులైన ఆయన జనసేన పార్టీ లీగల్‌సెల్ ఉమ్మడి ప్రకాశం జిల్లా కార్యదర్శిగా ఉన్నారు. గతంలో చీరాల న్యాయవాదుల సంఘం కార్యదర్శిగా పనిచేశారు. సేవా కార్యక్రమాల్లో ముందుడే కేసీఆర్ మరణం తీరని లోటని అనేక మంది ప్రముఖులు పేర్కొన్నారు. న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు జి.రమేష్ బాబు, ఎ.పుల్లయ్యానాయుడు, సీహెచ్ మస్తానరావు, జనసేన నాయకులు గూడూరి శివరామప్రసాద్, శ్రీనివాస్, న్యాయవాదులు, వివిధ రాజకీయ పార్టీల ప్రముఖులు మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు.

దేశాయిపేటలో స్కూటర్ దగ్ధం

వేటపాలెం, న్యూస్‌టుడే: ఇంటి ముందు ఉంచిన స్కూటర్ కాలిపోయిన ఘటన మంగళవారం దేశాయిపేటలో వెలుగుచూసింది. దేశాయిపేట సెంటరు నుంచి ఐటీఐ కాలనీకి వెళ్లే రోడ్డులో గొర్రె కొండమ్మ తన స్కూటర్‌ని ఇంటి ముందు సోమవారం రాత్రి నిలిపారు. ఆ తరువాత ఇంటిలోకి వెళ్లి నిద్రకు ఉపకరించారు. అర్ధరాత్రి 12 గంటల తరువాత కాలిన వాసన రావడంతో బయటకు వచ్చి చూడగా స్కూటర్‌ని మంటలు చుట్టుముట్టాయి. అప్పటికే వాహనం బాగా కాలింది. దీనిపై బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

వృద్ధురాలిని ఢీకొన్న కారు

చీరాల గ్రామీణం, న్యూస్‌టుడే: రహదారి దాటుతున్న వృద్ధురాలిని కారు ఢీకొని ఆపకుండా వెళ్లిన సంఘటన చీరాల మండలం ఈపూరుపాలెంలో మంగళవారం చోటుచేసుకుంది. అందిన వివరాల మేరకు రామ్‌నగర్‌కు చెందిన ఒక వృద్ధురాలు పని మీద ఈపూరుపాలెం వచ్చి, తిరిగి వెళ్లే క్రమంలో రోడ్డు దాటుతుండగా.. కారు ఢీకొంది. దీంతో ఆమె కింద పడి నుదిటిపై స్వల్ప గాయాలయ్యాయి. కానీ కారులోని వ్యక్తి వాహనాన్ని ఆపకుండా వెళ్లిపోయాడు. స్థానికులు ఆమెను పరిశీలిస్తుండగా.. అదే దారిలో వెళుతున్న ఈపూరుపాలెం ఎస్సై శివకుమార్ తన వాహనాన్ని ఆపి, వృద్ధురాలిని చీరాల ఏరియా వైద్యశాల తరలించడానికి చొరవ తీసుకున్నారు.